సంచలన వార్తలకు
నేడు
TELUGU DAILY
విలేకరులు కావలెను

అనతికాలంలోనే పత్రికారంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన నేడు తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను. తెలంగాణలోని 33 జిల్లాల్లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి ఉన్నవారు. nedudailynews@gmail.comకు బయోడెటా పంపగలరు.

9346984911
9133445456



# సంచలన వార్తలకు నేడు

TELUGU DAILY




భారీ లాభాల్లో సూచీలు.. 08


మంగళవారం | 23.12.2025 | సంపుటి : 3 | సంచిక :235 | పేజీలు : 8 | వెల : 2/- | www.nedudailynews.com


### ఆర్థిక ఇబ్బందులున్నా
## సంక్షేమంపై రాజీపడబోం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఉపకార వేతన బకాయిలు రూ.365 కోట్లు విడుదల

సంక్షేమ శాఖల్లో ఉపకార వేతనాల బకాయిలు రూ.365.75 కోట్లు విడుదల చేసినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. గత ప్రభుత్వ హయాం నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని అధికారులకు సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేలా, విద్యకు ప్రాధాన్యమిచ్చేలా ప్రజాప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని వివరించారు.



02



## ఫోన్ ట్యాపింగ్ కేసు
### రివ్యూ కమిటీలో ఉన్నవారిని మరోసారి విచారించిన సిట్

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. రివ్యూ కమిటీలో ఉన్న వారిని సిట్ మరోసారి విచారించింది. ప్రభాకర్ రావు ఫోన్ ట్యాపింగ్ చేసిన సమయంలో రివ్యూ కమిటీలో ఉన్న జీఏడీ సెక్రెటరీ, సీఎస్, ఇంటెలిజెన్స్ చీఫ్‌ను మరోసారి ప్రశ్నించి వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేసింది.

02

### గ్లోబల్ సమ్మిట్‌తో
## పెరిగిన రాష్ట్ర ప్రతిష్ఠ

- అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు ఇమేజ్
- సమ్మిట్ ద్వారా 5లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు
- ఎంఓయూలపై కెసిఆర్ చులకనగా మాట్లాడితే ఎలా
- మీ హయాంలో ఎంవోయూలపై పెట్టుబడులే లేవు
- కెసిఆర్ వ్యాఖ్యలను తిప్పికొట్టిన మంత్రి శ్రీధర్ బాబు

02



తెలంగాణ వేదికగా జరిగిన గ్లోబల్ సమ్మిట్ అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రతిష్ఠను పెంచిందని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు ఇప్పుడు తెలంగాణ వైపు ఆసక్తిగా చూస్తున్నారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. సమ్మిట్ విజయంపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు.

# బీఆర్ఎస్‌ను ఎండగట్టాలి

### సంతృప్తికరంగా పంచాయతీ ఫలితాలు
### మంత్రులను ప్రత్యేక అభినందనలు

- అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో సాగునీటి ప్రాజెక్టులపై విస్తృత చర్చ నిర్వహించాలి
- మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో గట్టిగా పనిచేయాలి : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- 29 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయం

పంచాయతీ ఎన్నికల ఫలితాలు సంతృప్తికరంగా వచ్చాయని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ఇంకా బలంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సచివాలయంలో మంత్రులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పంచాయతీ ఎన్నికలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు.

హైదరాబాద్, డిసెంబరు 22 : జల వివాదాలు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంపై అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో విస్తృత చర్చ నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ముఖ్యంగా కృష్ణా, గోదావరి జలాలపై బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారాన్ని శాసనసభ వేదికగా ఎండగట్టాలని సహచర మంత్రులకు సూచించారు. బీఆర్ఎస్ అధినేత, విపక్ష నేత కేసీఆర్ తాజాగా విలేకరుల సమావేశం నిర్వహించి రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో సాగునీటి రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేశారని, కృష్ణా జలాలపై హక్కులను రాబట్టుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే.

మిగతా 2 లో





### ముగిసిన రాష్ట్రపతి
## శీతాకాల విడిది

**హకీంపేటలో ఘనంగా వీడ్కోలు పలికిన గవర్నర్, సిఎం**

హైదరాబాద్, డిసెంబరు 22 : భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్ శీతాకాల పర్యటన ముగిసింది.. హకీంపేట్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతో కలిసి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడ్కోలు పలికారు. రాష్ట్రపతికి వీడ్కోలు పలికిన వారిలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి,మంత్రి సీతక్క , ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు ఉన్నారు. దాదాపు ఆరు రోజులపాటు ముర్ము హైదరాబాద్‌లో బస చేశారు. ఈ నెల 17న హైదరాబాద్ చేరుకున్న ఆమె.. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 19న రామోజీఫిల్మ్‌సిటీలో నిర్వహించిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్‌పర్సన్ల జాతీయ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 20న గచ్చిబౌలిలో బ్రహ్మకుమారీస్ శాంతిసరోవర్ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. 21న రాష్ట్రపతి నిలయంలో ఎట్ హోమ్ నిర్వహించారు. ఆరు రోజుల శీతాకాల విడిది ముగించుకున్న రాష్ట్రపతి.. ప్రత్యేక విమానంలో దిల్లీ పయనమయ్యారు. ఆమెకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర కిషన్‌రెడ్డి తదితరులు వీడ్కోలు పలికారు.



### విద్యుత్ ఉద్యోగులకు 17.651 శాతం డీఏ

**హైదరాబాద్, డిసెంబరు 22 :** విద్యుత్ ఉద్యోగులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. 17.651 శాతం డీఏను ఖరారు చేసింది. 2025 , జూలై 1వ తేదీ నుంచి ఈ డీఏ అమలు కానుంది. డీఏ పెంపు ప్రతిపాదనలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆమోదం తెలిపారు. ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఉద్యోగులందరికీ డీఏ వర్తిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల మొత్తం 71,387 మంది ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు లబ్ది చేకూరనుంది. అంతేకాకుండా విద్యుత్ సంస్థలపై నెలకు 9.39 కోట్ల రూపాయల అదనపు ఆర్థిక భారం పడనుంది.




### జీహెచ్ఎంసీ వన్‌టైమ్ సెటిల్‌మెంట్

ఆస్తిపన్ను చెల్లింపులో 90శాతం వడ్డీ రాయితీ

### కమీషన్ల కోసం
## కాళేశ్వరం ప్రాజెక్టు

- మేడిగడ్డ ప్రాజెక్టు గురించి మాట్లాడటం ఆపండి
- రూ.లక్షల కోట్లు అప్పులు చేసి ఎదురుదాడా?
- పాలమూరు -రంగారెడ్డిని ఎందుకు పండపెట్టారు
- ఇవన్నీ చేసినందుకు సిగ్గుతో తలదించుకోవాలి
- పెద్దపల్లి జిల్లాలో కూలిన చెక్‌డ్యామ్‌లు పరిశీలన
- కేసీఆర్ తీరుపై తీవ్ర పదజాలంతో ఉత్తమ్ విమర్శలు

కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి రూ. లక్షల కోట్లు అప్పులు చేసిన వారు ఇప్పుడు మళ్లీ రంకెలు వేస్తున్నారని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ డిజైన్ చేసి.. నిర్మించిన కాళేశ్వరం వారి హయాంలోనే కూలిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు.

**పెద్దపల్లి, డిసెంబర్ 22 :** మేడిగడ్డ ప్రాజెక్టు గురించి మాట్లాడటం ఆపి.. సిగ్గుతో తలదించుకోవాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో ఐదేళ్లలో వాడుకున్న నీరు 70, 80 టీఎంసీ లే. రూ. 1.80 లక్షల కోట్ల ప్రాజెక్టు నిరుపయోగం కావడం బీఆర్ఎస్ ఘనత. ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలు అనేది

మిగతా 2 లో






### పవన్, ఎన్టీఆర్‌ల
## పిటిషన్లపై విచారణ

**ఫోటోల మార్ఫింగ్‌పై ఢిల్లీ కోర్టు ఆదేశం**

న్యూఢిల్లీ, డిసెంబరు 22 : ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రముఖ సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ దాఖలు చేసిన వ్యక్తిత్వ హక్కుల పిటిషన్లపై ఢిల్లీ హైకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. జస్టిస్ మన్మీత్ ప్రీతం సింగ్ అరోరా ధర్మాసనం ఈ వ్యవహారాన్ని పరిశీలించింది. సామాజిక మాధ్యమాల్లో తమ ఫొటోలు, వీడియోలను అనుమతి లేకుండా వాణిజ్య అవసరాలకు వినియోగించడం, తప్పుడు ప్రచారం చేయడం వల్ల తమ వ్యక్తిత్వ హక్కులకు భంగం వాటిల్లుతోందని ఎన్టీఆర్, పవన్ కల్యాణ్ పిటిషన్లలో పేర్కొన్నారు. వీరిద్దరి తరఫున

మిగతా 2 లో

### రేవంత్ రెడ్డికి
## నీతి జాతి లేదు

**కేసీఆర్ స్టేట్స్‌మెన్‌లా మాట్లాడితే.. రేవంత్ స్ట్రీట్ రౌడీలా మాట్లాడారు**

- ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అపసోపాలు
- హామీలపై మాయ మాటలు చెబితే ఎలా?
- ఉత్తమ్‌కు విషయ పరిజ్ఞానం లేదు
- మండిపడ్డ బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు

**హైదరాబాద్, డిసెంబరు 22 :** రేవంత్ రెడ్డికి నీతి జాతి లేదని, ఎప్పుడు ఏ పార్టీలో ఉంటాడో కూడా తెలియనది, రేవంత్ రెడ్డి... రేపు ఏ పార్టీలో ఉంటాడో తెలియదని సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీష్ రావు హాట్ కామెంట్స్ చేశారు. సోమవారం నాడు మీడియా తో మాట్లాడుతూ... కేసీఆర్ స్టేట్స్‌మెన్‌లా మాట్లాడితే.. రేవంత్ స్ట్రీట్ రౌడీ మాదిరి మాట్లాడారని విమర్శించారు. త్యాగాల చరిత్ర తమది అని.. వెన్నుపోటుకు మారు పేరు రేవంత్ రెడ్డి అని కామెంట్స్ చేశారు. సంకుచిత, మరగుజ్జు మనస్తత్వంతో ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌ను తెలంగాణ ద్రోహిగా కేసీఆర్ ప్రజల ముందు నిలబెట్టారని అన్నారు.

మిగతా 2 లో



# బీఆర్ఎస్‌ను ఎండగట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో గతంలో జలాల వినియోగానికి సంబంధించి కేసీఆర్ చేసిన ప్రసంగాలు, వారి హయాంలో చేసిన నిర్ణయాలు, కేంద్రానికి రాసిన లేఖలు, కుదుర్చుకున్న ఒప్పందాలు, బీఆర్ఎస్ హ యాంలో తెలంగాణకు ఏ విధంగా అన్యాయం చేశారన్న అంశాలను సభకు వివరించాలని నిర్ణయించినట్లు తెలిసింది. సీఎం రేవంత్ సోమవారం రాత్రి ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో దాదాపు మూడున్నర గంటలపాటు మంత్రులతో సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ సమావేశాల్లో చర్చించే అంశాలపై దిశానిర్దేశం చేశారు. వీటికి సంబంధించి పలు నిర్ణయాలు తీసుకున్నారు.

### ప్రాజెక్టులపై సమగ్ర చర్చ

తెలంగాణ, ఏపీ మధ్య కృష్ణా జలాల పంపిణీ, కేంద్రం దగ్గర పెండింగ్‌లో ఉన్న అనుమతులు, ఏపీ అక్రమ నీటి వినియోగం, అనుమతి లేకుండా చేపడుతున్న ప్రాజెక్టులను అడ్డుకునేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలను సభలో చర్చకు పెట్టనున్నారు. సాగునీటి రంగం విషయంలో గత ప్రభుత్వం అనుసరించిన విధానాలతో రాష్ట్రానికి జరిగిన నష్టం వి వరించడంతో పాటు బీఆర్ఎస్ చేస్తున్న అసత్యాల ను ఎండగట్టాలని నిర్ణయించారు. అవసరం అ యి తే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడానికి సిద్ధం కావాలని కూడా సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

### మొత్తం 4 రోజులు అసెంబ్లీ

ఈ నెల 29న అసెంబ్లీ సమావేశాలను ప్రారంభించాలని, ఆ తర్వాత జనవరి రెండో తేదీ నుంచి కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిసింది. మొత్తం నాలుగు రోజులు నిర్వహించే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తైన సందర్భంగా ఇటీవల నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్, ఇటీవల ముగిసిన పంచాయ తీ ఎన్నికల ఫలితాల సరళి, ఇతర వర్తమాన రాజకీయ అంశాలపై సమావేశంలో విస్తృతంగా చ ర్చించారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయంపై సీఎం రేవంత్ సంతృప్తి వ్యక్తం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు మరికొంత కష్టపడితే సీట్లు పెరిగేవని, కొన్ని జిల్లాల్లో ఇబ్బంది ఎదుర్కొన్న విషయాన్ని, నియోజకవర్గాల వారీగా గెలుచుకున్న పంచాయతీలను మంత్రులకు ముఖ్యమంత్రి వివరించారు. త్వరలో జరగనున్న జిల్లా పరిషత్ ఎన్నికల్లో గట్టిగా పనిచేయాలని సూచించారు. జిల్లాల ఇన్‌చార్జి మంత్రు లే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో గెలుపు బాధ్య త చేపట్టాలని, మొత్తం జెడ్పీలను కైవసం చేసుకోవాలని స్పష్టం చేసినట్లు తెలిసింది. ఇక జీహెచ్ఎంసీలో శివారు మునిసిపాలిటీల విలీనం అనంతరం చేపట్టిన డివిజన్ల పునర్వ్యవస్థీకరణ తీరుతెన్నులను వివరించినట్లు తెలిసింది. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో చర్చించే అంశం అప్పటి పరిస్థితులను బట్టి నిర్ణయిద్దామని సీఎంచెప్పినట్టు సమాచారం.

# ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమంపై రాజీపడబోం



**హైదరాబాద్:** సంక్షేమ శాఖల్లో ఉపకార వేతనాల బకాయిలు రూ.365.75 కోట్లు విడుదల చేసినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. గత ప్రభుత్వ హయాం నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని అధికారులకు సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేలా, విద్యకు ప్రాధాన్యమిచ్చేలా ప్రజాప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని వివరించారు. సోమవారమిక్కడ ప్రజాభవన్‌లో ఆర్థిక, సంక్షేమ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖకు రూ.21.62 కోట్లు, ఎస్సీ సంక్షేమశాఖకు రూ.191.63 కోట్లు, గిరిజన సంక్షేమశాఖకు రూ.152.50 కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులున్నా విద్య, సంక్షేమం విషయంలో ప్రభుత్వం రాజీపడబోదని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ఆయా సంక్షేమశాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఎస్సీ, ఎస్టీ బకాయిలు చెల్లించేందుకు మార్గం సుగమం..

రాష్ట్ర ప్రభుత్వం రూ.365 కోట్లు విడుదల చేయడంతో ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఫీజుల బకాయిలు చెల్లించేందుకు మార్గం సుగమమైంది. ఎస్సీ విద్యార్థులకు చెల్లించే ఫీజుల డిమాండ్‌లో కేంద్రం 60%, రాష్ట్ర ప్రభుత్వం 40%... అలాగే ఎస్టీ విద్యార్థులకు కేంద్రం 75%, రాష్ట్ర ప్రభుత్వం 25% వాటా భరించాలి. రాష్ట్రం తొలుత నిధులు విడుదల చేస్తేనే కేంద్రం తమవంతు వాటా సొమ్ము చెల్లిస్తుంది. ప్రస్తుతం రాష్ట్ర వాటా విడుదల చేయడంతో కేంద్రం వాటా త్వరలో విడుదల కానుంది. ఈ మొత్తం నిధులు అందుబాటులోకి వస్తే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 2024–25 విద్యాసంవత్సరం నాటికి బకాయిల చెల్లింపులు పూర్తవుతాయని సంక్షేమశాఖలు అంచనా వేస్తున్నాయి. ఎస్సీ విద్యార్థులకు బోధన ఫీజుల బకాయిలు విద్యార్థుల ఖాతాల్లో... ఎస్టీ విద్యార్థులకు బోధన బకాయిలు కళాశాలల ఖాతాల్లో జమకానున్నాయి.

# గ్లోబల్ సమ్మిట్‌తో పెరిగిన ప్రతిష్ట

**హైదరాబాద్, డిసెంబర్ 22:** తెలంగాణ వేదికగా జరిగిన గ్లోబల్ సమ్మిట్ అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రతిష్టను పెంచిందని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు ఇప్పుడు తెలంగాణ వైపు ఆసక్తిగా చూస్తున్నారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. సమ్మిట్ విజయంపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్రానికి పెట్టుబడులు, నిరుద్యోగులకు ఉద్యోగాలు రావడం కేసీఆర్‌కు ఇష్టం లేనట్లు ఆయన మాటలు ఉన్నాయని మంత్రి మండిపడ్డారు. ఈ సమ్మిట్ ద్వారా 5 లక్షల కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులకు సంబంధించి ఎంఓయూలు జరిగాయని, వీటిని కేసీఆర్ చాలా తేలికగా మాట్లాడటం తగదని శ్రీధర్ బాబు అన్నారు. 'కేసీఆర్ హయాంలోనూ అనేక ఒప్పందాలు జరిగాయి, కానీ అన్నీ కార్యరూపం దాల్చలేదు. మేము వాటి గురించి ఎప్పుడూ రచ్చ చేయలేదు. ఇప్పుడు మేము కుదుర్చుకున్న ప్రతి ఒప్పందాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు పక్కాగా ఫాలో–అప్ చేస్తున్నాం' అని స్పష్టం చేశారు. ఈ పెట్టుబడుల ద్వారా 1.40 లక్షల మందికి ప్రత్యక్షంగా, మరో 2 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ త్వరలోనే ప్రపంచానికే 'జీసీసీ క్యాపిటల్' కాబోతోందని మంత్రి ప్రకటించారు. గడిచిన ఏడాది కాలంలోనే 75 అంతర్జాతీయ స్థాయి గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను రాష్ట్రానికి తీసుకువచ్చామని వెల్లడించారు. ఐటీ, ఏరోస్పేస్, వ్యాక్సిన్ తయారీ రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా ఉందని, ప్రపంచానికి అవసరమైన మూడు వంతుల వ్యాక్సిన్లు ఇక్కడి నుంచే ఎగుమతి అవుతున్నాయని గుర్తుచేశారు. వ్యాపార సంస్కరణల అమలులో కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ అవార్డు అందుకోవడం మా ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని పేర్కొన్నారు. వరంగల్ టెక్స్‌టైల్ పార్క్ బీఆర్ఎస్ పేటెంట్ అని చెప్పుకోవడంపై మంత్రి స్పందిస్తూ.. రక్షణ రంగంలో అలాగే ఐటీ , మ్యానిఫ్యాక్చరింగ్ రంగాలకు పునాది వేసింది కాంగ్రెస్ పార్టీయే. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పనులు అసంపూర్తిగా ఉంటే, సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సందర్శించి నిధులు కేటాయించి పనులు పూర్తి చేయించారు. పీఎం మిత్ర పథకం కింద కేంద్రం నుండి 30 కోట్ల నిధులు తెచ్చింది మేమని వివరించారు. బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి మంత్రి ఘాటు వ్యాఖ్యలు చేస్తూ.. మీరు హైప్ లో ఉన్నారు.. మేము ప్రజల్లో హోప్ క్రియేట్ చేస్తున్నాం అన్నారు. గత ప్రభుత్వంలో ఉన్న 'గేట్ పాస్' కల్చర్‌ను రద్దు చేశామని, అందరినీ కలుపుకుని పారిశ్రామికాభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. కేవలం పరిశ్రమలు తేవడమే కాకుండా, స్థానిక యువతకు ఉపాధి దక్కేలా ఐటీఐ లను ఏటీసీ లుగా మార్చామని మంత్రి తెలిపారు. ఎంఎస్ఎంఈల కోసం కొత్త పాలసీని తీసుకువచ్చామని, పారిశ్రామికవేత్తల్లో నమ్మకాన్ని నింపుతూ కక్షసాధింపులు లేని పాలనను అందిస్తున్నామని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. రాబోయే మూడేళ్లలో మరిన్ని భారీ పెట్టుబడులను ఆకర్షించి తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ పారిశ్రామిక రాష్ట్రంగా నిలబెడతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



# ప్రాజెక్టుల నిర్మాణ లోపాలే ఆయకట్టుకు శాపాలు

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ధ్వజం

**గద్వాల:** ప్రాజెక్టుల నిర్మాణ లోపాలే ఆయకట్టుకు శాపాలుగా మారాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆరోపించారు. 'జాగృతి జనం బాట'లో భాగంగా గద్వాల జిల్లా ధరూరు, గట్టు మండలాల పరిధిలో సోమవారం ఆమె పర్యటించారు. నెట్టెంపాడు, గట్టు ఎత్తిపోతల పథకాలు.. గుడ్డెందొడ్డి, ర్యాలంపాడు జలాశయాలను పరిశీలించారు. అనంతరం గద్వాలలో విలేకరులతో మాట్లాడుతూ... "ఎత్తిపోతలకు అవసరమైనన్ని పంపులున్నా నీటిని తరలించటానికి సరైన కాలువలు లేని దుస్థితి నెలకొంది. పదేళ్ల పాలనలో ప్రాజెక్టుల నిర్మాణ లోపాలను గుర్తించి సరిదిద్దాల్సిన గత ప్రభుత్వం విస్మరించిందని దుయ్యబట్టారు. గట్టు ఎత్తిపోతల పథకం గుత్తేదారులకు, పాలకులకు పర్సంటేజీల పథకంగా మారిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్, కరప్షన్ పాలిటిక్స్‌కు చిరునామాగా మారిందన్నారు. విద్య, వైద్యం విషయంలో నడిగడ్డ ప్రాంతానికి అన్యాయం జరుగుతోందన్నారు. గద్వాల చేనేత పార్కు పనులు పదేళ్లయినా ముందుకు కదలటం లేదని ఇది పాలకుల వైఫల్యమే అని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో గద్వాల ప్రజలు పని చేయనివారికి ఓటుతోనే సమాధానం చెప్పాలన్నారు.

# కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు

(మొదటిపేజీ తరువాయి)

పదేళ్లకు అంగీకరించారు. పాలమూరు, ఎస్ఎల్‌బీసీని బీఆర్ఎస్ పూర్తి చేస్తుంటే ఎవరైనా అడ్డుకున్నారా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీల కింద ఏటా రూ.16వేల కోట్లు చెల్లిస్తున్నాం. పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు పూర్తిగా రాలేదు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన రూ.5 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. ప్రాజెక్టు పూర్తి చేయకుండానే పాలమూరు ప్రజలకు అన్యాయం చేశారని ఉత్తమ్ విమర్శించారు. ఈ మేరకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వంపై అనవసరంగా విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కేసీఆర్ చెప్పేవన్నీ అసత్యాలేనని విమర్శించారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ. 27 వేల కోట్లు ఖర్చు పెట్టారని.. అయిన 90 శాతం పనులు కూడా ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం రూ.5 వేల కోట్లు పెండింగ్ బిల్లులు పెట్టిందని ఆరోపించారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టుకు ఎన్విరాన్‌మెంట్ క్లియరేన్స్ రాలేదని చెప్పుకొచ్చారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేయకుండా మహబూబ్‌నగర్ ప్రజలను బీఆర్ఎస్ మోసం చేసిందని ధ్వజమెత్తారు సోమవారంపెద్దపల్లి జిల్లాలో మంత్రి ఉత్తమ్ పర్యటించారు. ఈ సందర్భంగా గుంపుల, అడవి సోమనపల్లి గ్రామాల్లో కూలిపోయిన చెక్ డ్యాంలను పరిశీలించారు. ఈ ఘటనపై అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంపుల, అడవి సోమనిపల్లి గ్రామాల్లో కూలిపోయిన చెక్ డ్యాంలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించామని తెలిపారు. ఈ పనులను నాసిరకంగా, నాణ్యతలేమితో నిర్మించినా లేదా ఎవరైనా కావాలనే ధ్వంసం చేసినట్లు తేలినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయాన్ని తమ ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని అన్నారు. ఈ విచారణను వేగవంతం చేసి బాధ్యులను గుర్తించాలని ఇప్పటికే విజిలెన్స్ అధికారులను ఆదేశించామని అన్నారు. రైతన్నలకు మేలు చేసే చెక్ డ్యాంలను ఎవరైనా



కావాలని ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తే ఉపేక్షించబోమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. 'నీటి వాటాలో 71 శాతం మాకు 29శాతం ఏపీకి ఇవ్వాలని మేము పోరాడుతున్నాం. 17 జనవరి 2024, ఫిబ్రవరిలో కేఆర్ఎంబీకి లేఖ ఇచ్చాం. ఇరిగేషన్ కాంట్రాక్టర్ల లిస్ట్ తీయండి. కేసీఆర్ హయంలో లాగా ఏపీ కాంట్రాక్టర్లకు మేము ఇచ్చామా..? హరీశ్‌రావు పేరు మార్చుకుని గోబెల్స్ అని పెట్టుకోవాలి. కాళేశ్వరం విషయంలో పదే పదే అసత్యాలు మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ నాయకులు సిగ్గుతో తలవంచుకోవాలి. తెలంగాణ ప్రజల తలను తాకట్టు పెట్టి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారు. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం కూలిపోయింది. రాష్ట్రంలో ఇప్పుడున్న ప్రాజెక్టులను కట్టింది కాంగ్రెస్. కాళేశ్వరం నుంచి గత ఐదేళ్లలో 70 టీఎంసీల నీళ్లను మాత్రమే ఉపయోగించారు. హరీశ్‌రావు అతి తెలివితేటలు వాడటం ప్రజలు గమనిస్తున్నారు. కృష్ణా జలాల విషయంలో 2014 నుంచి 2020 వరకు జరిగిన అపెక్స్ కౌన్సిల్ భేటీల్లో కేసీఆర్ సంతకాలు పెట్టారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రస్తావించారు.

# పవన్, ఎన్టీఆర్‌ల పిటిషన్లపై విచారణ

(మొదటిపేజీ తరువాయి)

సీనియర్ న్యాయవాది సాయి దీపక్ వాదనలు వినిపించారు. మార్ఫింగ్ ఫొటోలు, అవమానకర పోస్టులు విస్తృతంగా ప్రచారంలో ఉన్నాయని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. కేసుల్లో ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, గూగుల్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఇప్పటికే కొన్ని లింకులను తొలగించినట్లు ప్రతివాదులు కోర్టుకు వివరించారు. అయితే తొలగించిన లింకులపై ఆదేశాలు జారీ చేయడానికి ముందు సంబంధిత ఖాతాదారులకు వాదనలు వినిపించే అవకాశం ఇవ్వాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. లింకులు అభిమానుల ఖాతాల నుంచి వచ్చినవని ఇన్‌స్టాగ్రామ్ నిరాకరణతో స్పష్టంగా పేర్కొనాలని హైకోర్టు సూచించింది. గూగుల్ తమ వినియోగదారులకు ఈ విషయాన్ని తెలియజేయాలని లేదా ఖాతాలను నిలిపివేయాలని ఆదేశించింది. సంబంధిత లాగిన్ వివరాలను మూడు వారాల్లో అందించాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశిస్తూ తదుపరి విచారణను మే 12వ తేదీకి వాయిదా వేసింది.

# ఫోన్ ట్యాపింగ్ కేసు..

**హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. రివ్యూ కమిటీలో ఉన్న వారిని సిట్ మ–రోసారి విచారించింది. ప్రభాకర్ రావు ఫోన్ ట్యాపింగ్ చేసిన సమయంలో రివ్యూ కమిటీలో ఉన్న జీఏడీ సెక్రెటరీ, సీఎస్, ఇంటెలిజెన్స్ చీఫ్‌ను మరోసారి ప్రశ్నించి వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేసింది. మాజీ ఐఏఎస్ అధికారి సోమేశ్ కుమార్, మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్, ఐపీఎస్ అధికారి నవీన్ చంద్‌కు సైతం నోటీసులు ఇచ్చి సిట్ విచారించింది. అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ నవీన్ చంద్ ఎదుట ప్రభాకర్‌రావును ఉంచి వివరాలడిగింది. రెండోసారి నవీన్ వద్దకు వెళ్లి ఆయన స్టేట్‌మెంట్ రికార్డు చేసింది. మాజీ ఐఏఎస్ అధికారి, అప్పటి సీఎస్ సోమేశ్ కుమార్ స్టేట్‌మెంట్ కూడా మరోసారి రికార్డు చేసిన సిట్.. ఈ కేసులో అనుబంధ ఛార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు ప్రయత్నిస్తోంది.

# రేవంత్ రెడ్డికి నీతి జాతి లేదు

(మొదటిపేజీ తరువాయి)

సీఎం, నీళ్ళ మంత్రికి ఎందుకంత నొప్పి అని నిలదీశారు. ఎవరి ఒత్తిడితో నీటి వాటాను తగ్గించుకున్నారని ప్రశ్నించారు. 45 టీఎంసీలకు.. మంత్రి ఉత్తమ్ స్వయంగా తన దస్తూరితో కేంద్రానికి లేఖ రాశారని చెప్పారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి.. ఉత్తర కుమారుడిలా మిగిలిపోయారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అనుభవమంతా దోపిడికి, లూటీకి పనికొస్తుం దంటూ వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ఆదివారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడిన మాటలపై రేవంత్ రెడ్డి చిట్‌చాట్‌లో స్పందించిన తీరును బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు తప్పుపట్టారు. తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. కేసీఆర్ ఒక స్టేట్స్‌మెన్‌లా మాట్లాడితే.. రేవంత్ రెడ్డి స్ట్రీ రౌడీలా మాట్లాడారని విమర్శించారు. ఓ గల్లీ రౌడీ మాటల్లా, ఓ గూండా మాటల్లా రేవంత్‌రెడ్డి మాటలు ఉన్నాయని విమర్శించారు. తెలంగాణకు ఒక నొక్కుపడనియ్యను అని కేసీఆర్ చాలా గొప్పగా మాట్లాడారని, ఆ మాటతో సీఎం రేవంత్‌రెడ్డికి, నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి వచ్చిన నొప్పి ఏమిటో అర్థం కావడం లేదని హరీశ్ రావు అన్నారు. తప్పు చేసింద్రు కాబట్టే వాళ్లకు నొప్పి కలుగుతున్నదని వ్యాఖ్యానించారు. ఉత్తమ్ కుమార్‌రెడ్డి నిన్న ఉత్తరకుమారుడిగా తేలిపోయారని ఎద్దేవా చేశారు. ఆసరా పింఛన్‌లను రూ.4 వేలకు పెంచుతామని ఎందుకు పెంచలేదని కేసీఆర్ ప్రశ్నించారని, దానికి మీరు ఎందుకు సమాధానం చెప్పలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి అపారమైన అనుభవం ఉన్నదని, నిధులు ఎలా సమీకరించాలో, ప్రజలకు ఎలా ఇవ్వాలో బాగా తెలుసని ఎన్నికల ముందు చెప్పింద్రు కదా.. ఇప్పుడు ఏమైంది మీ అనుభవం అని హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. మీ అనుభవం అంతా దోపిడీలకు, కమిషన్‌లకు, వాటాలకు, లూటీలకే సరిపోయిందా..? అని ప్రశ్నించారు. 'బీఆర్ఎస్ హయాంలో ఆటో డ్రైవర్‌కు ఫోన్ చేస్తే యూరియా బస్తాలు తెచ్చి ఇంట్లో వేసి వెళ్లేవారని, ఇప్పుడు చెప్పులు లైన్‌లో పెట్టే పరిస్థితి వచ్చిందని, యాప్‌లు, మ్యాప్‌లతో రైతులను ఎందుకు గోసపెడుతున్నరని కేసీఆర్ ప్రశ్నించారు. దానికి మీ సమాధానం ఏదీ అని హరీశ్‌రావు అన్నారు. హైదరాబాద్ నగర శ్రేయ–స్సు కోసం తాము ఫార్మాసిటీ కోసం కేటాయించిన స్థలంలో ఇప్పుడు ఫ్యూచర్ సిటీ ఎందుకు అంటున్నారని కేసీఆర్ అడిగిన ప్రశ్నకు సీఎం నుంచి సమాధానం లేదని హరీశ్‌రావు మండిపడ్డారు. కేసీఆర్ రాష్ట్ర ప్రయోజనాల గురించి, హైదరాబాద్ శ్రేయస్సు గురించి మాట్లాడితే.. రేవంత్ రెడ్డి అంతా సొల్లు మాట్లాడారని విమర్శించారు. 'కేసీఆర్ హయాంలో ఆర్థిక అరాచకత్వం సాగింది' అన్న సీఎం రేవంత్ రెడ్డి మాటలపై కూడా మాజీ మంత్రి మండిపడ్డారు. ఇటీవల జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో నువ్వు ఆహ్వానించిన ప్రముఖులే తెలంగాణ ఆర్థిక ప్రగతిని కొనియాడారని హరీశ్‌రావు గుర్తుచేశారు. బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్, ఆర్బీఐ గవర్నర్ సుబ్బారావు మాట్లాడిన మాటలను రేవంత్ రెడ్డి ఒకసారి వీడియో పెట్టుకుని చూడాలని సూచించారు. కొత్త రాష్ట్రమైనా తెలంగాణ అద్భుతమైన ఆర్థిక ప్రగతిని సాధించిందని, మూడు రెట్ల జీఎస్‌డీపీని సాధించిందని, మూడు రెట్ల తలసరి ఆదాయం పెరిగిందని వారు కేసీఆర్ పాలనను మెచ్చుకున్న విషయాన్ని గుర్తుచేశారు. ఎమ్మెల్యేను కొంటూ రూ.50 లక్షలతో పట్టపగలు దొరికిన దొంగ రేవంత్ రెడ్డి అని అన్నారు. రూ.50 కోట్లకు రేవంత్ పీసీసీ పదవి కొనుకున్నాడని కోమటిరెడ్డి వెంకటరెడ్డే చెప్పారని గుర్తుచేశారు. రేవంత్‌కు ఒక స్టాండ్, సిద్ధాంతం, పద్ధతి లేదన్నారు. ధాన్యం, డాక్టర్ల ఉత్పత్తిలో తెలంగాణను నంబర్ వన్ చేసిందే కేసీఆర్ అని అన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి.. ఇప్పుడైనా ప్రిపేర్ అయ్యి ప్రెస్‌మీట్స్ నిర్వహించాలని ఎద్దేవా చేశారు. నీళ్ళ మంత్రి ఉత్తమ్‌కు సగం సగం నాలెడ్జ్ మాత్రమే ఉందంటూ మాజీ మంత్రి హరీష్ రావు కామెంట్స్ చేశారు.

# రాచకొండ పరిధిలో పెరిగిన నేరాలు

### గణాంకాలు వివరించిన కమిషనర్



**హైదరాబాద్, డిసెంబరు 22:** రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది నేరాలు పెరిగాయి. 2024లో 28,626 కేసులు నమోదు కాగా.. 2025లో ఈ సంఖ్య 33,040కు పెరిగింది. మహిళలపైనా గత ఏడాదితో పోలిస్తే 4 శాతం అధికంగా నేరాలు నమోదయ్యాయి.కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది 21,056 కేసులను పరిష్కరించాం అని కమిషనర్ సుధీర్ బాబు తెలిపారు. 12 కేసుల్లో దోషులకు 20 ఏళ్ల జైలుశిక్ష పడేలా దర్యాప్తు చేశాం. అడ్డగూడూరు పీఎస్ పరిధిలో జరిగిన హత్య కేసులో 17 మంది నిందితులకు జీవిత ఖైదు పడింది. సైబర్ నేరాలకు పాల్పడిన వారిపై 3,734 కేసులు నమోదు చేశాం. 6,188 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశాం. సైబర్ క్రైమ్ బాధితులకు రూ.40.10 కోట్లను రిఫండ్ చేశాం. డ్రగ్స్ రవాణా చేస్తున్న 495 మందిని అరెస్టు చేసి.. రూ.20 కోట్లు విలువ చేసే మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నాం. ఇందులో తెలంగాణకు చెందిన వారు 322 మంది, ఇతర రాష్ట్రాల వారు 172 మంది, ఒక విదేశీయుడు ఉన్నారు. కమిషనరేట్ పరిధిలో 227 ఎన్డీపీఎస్ అనుమానిత షీట్లను తెరిచాం. నాన్‌బెయిలబుల్ వారెంట్ ఫ్రీ కమిషనరేట్‌గా రాచకొండను తీర్చిదిద్దాం అని రాచకొండ సీపీ సుధీర్ బాబు వెల్లడించారు. కేసుల వివరాల్లోకి వెళితే.. 579 కిడ్నాప్ కేసులు, 1224 పోక్సో కేసులు, దోపిడి కేసులు 3, దొంగతనాలు 67, ఇళ్లలో చోరీలు 589, వాహనాల చోరీలు 876, సాధారణ చోరీలు 1,161, హత్యలు 73, అత్యాచారాలు 330, వరకట్నం మరణాలు 12, గృహ హింస కేసులు 782 నమోదైనట్లు వివరించారు,.

# పారదర్శకంగా యూరియా విక్రయాలకే యాప్

### విపక్ష నేతల విమర్శలు అర్థరహితం : మంత్రి తుమ్మల

**హైదరాబాద్:** రాష్ట్రంలో యూరియా పక్కదారి పట్టకుండా, రైతులు క్యూలైన్లలో వారి సమయాన్ని వృథా చేసుకోకుండా.. పారదర్శకంగా విక్రయాలు జరగాలన్న ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం మొబైల్ యాప్‌ను తెచ్చిందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సిద్దిపేట, గజ్వేల్‌లలోనే కాదు.. రాష్ట్రంలో ఏ ప్రాంతంలోని రైతులైనా వారికి దగ్గర్లోని షాప్‌లోనే యూరియా కొనుక్కునే సదుపాయం కల్పిస్తున్నట్లు వివరించారు. ప్రతిపక్ష నాయకులు యాప్ మీద అనుమానాలు రేకెత్తిస్తూ మాట్లాడడం సమంజసం కాదని.. వారి విమర్శలు అర్థరహితమని ధ్వజమెత్తారు. సోమవారం సచివాలయంలో మంత్రి విలేకరులతో మాట్లాడారు. "మా ప్రభుత్వం వచ్చాక మొదటి రెండు పంట కాలాల్లో యూరియా సరఫరా సక్రమంగా జరిగింది. మూడో పంటకాలంలో కేంద్రం నుంచి కేటాయింపులు సమయానికి రాకపోవడంతో సరఫరాలో ఇబ్బందులు ఎదురయ్యాయి. యూరియా అందుబాటులో ఉన్నప్పటికీ ప్రతిపక్ష నాయకులు భయపెట్టేలా మాట్లాడేసరికి రైతులంతా ఒకేసారి కొనుగోళ్ల కోసం వచ్చారు. కొందరు యూరియాను పక్కదారి పట్టించారు. వీటన్నింటికీ పరిష్కారంగా ఇంటినుంచే యూరియా బుకింగ్ కోసం యాప్‌ను తెచ్చాం. రైతులు కోరితే యాప్‌లో మార్పులు చేస్తాం. భారాస నాయకులు కూడా రైతుల ప్రయోజనాల కోసం మార్పులు సూచించవచ్చు. మాది నియంతృత్వ ప్రభుత్వం కాదు. రైతుల ప్రయోజనాలకే మొదటి ప్రాధాన్యమిస్తాం" అని తుమ్మల పేర్కొన్నారు.



# రాయలసీమను రతనాల సీమ చేస్తానని అనలేదా?

- నీటి హక్కులపై దోబూచిలాడిందే కేసీఆర్
- మండిపడ్డ మంత్రి జూపల్లి కృష్ణారావు



**హైదరాబాద్, డిసెంబరు 22 :** బీఆర్ఎస్ బలహీనమైందని కేసీఆర్‌కు అర్ధమైందని.. పార్టీని కాపాడుకోవడానికే మాజీ సీఎం బయటకు వచ్చారని మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యలు చేశారు. కెటిఆర్‌తో లాభం లేదని తెలుసుకున్నాడని ఎద్దేవా చేశారు. సోమవారం నాడు మాట్లాడుతూ... కొడుకు, అల్లుడు వల్ల పార్టీ దిగజారుతోందని కేసీఆర్ భావించారని తెలిపారు. పాలమూరు ప్రాజెక్టులను కాంగ్రెస్ పట్టించుకోవడం లేదనేది అబద్ధమన్నారు. కేసీఆర్ ముందు చేసే పని వెనక, వెనక చేసే పని ముందు చేశారని విమర్శించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ఇరిగేషన్ కోసం కాదు తాగునీటి కోసమే అని.. సుప్రీం కోర్టులో కేసీఆర్ ప్రభుత్వం చెప్పిందని గుర్తుచేశారు. పదేళ్ల పాటు ఈ ప్రాజెక్టును పక్కన పెట్టారని, దీనికి సమాధానం చెప్పాల న్నారు. కేసీఆర్ నీళ్ల విషయంలో అనేక తప్పిదాలు చేశారని మండిప డ్డారు. తెలంగాణ నీటి హక్కులను వాడుకోవడంలో కేసీఆర్ విఫలమ య్యారన్నారు. బీజేపీ ప్రతి అడుగులో బీఆర్ఎస్ తోడుగా ఉందని ఆరోపించారు. జగన్ దగ్గరకు వెళ్ళి రాయలసీమను రతనాల సీమగా చేస్తానని కేసీఆర్ అన్నారని.. నీటి హక్కులను సాధించకపోవడంలో వైఫల్యం కేసీఆర్ దే అని వ్యాఖ్యలు చేశారు. పాలమూరు ప్రాజెక్టులపై ప్రేమ ఉన్నట్టు కేసీఆర్ నటిస్తున్నారని మంత్రి విమర్శలు గుప్పించారు. యూరియాపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి స్పందిస్తూ.. యూరియా కొరతకు కేంద్రమే కారణమన్నారు. సప్లయ్ లేనప్పుడు డిమాండ్ ఎక్కువ అవుతుందని తెలిపారు. ఉన్న యూరియాను సక్రమంగా ఇవ్వాలనుకోవడం తమ తప్పా అని ప్రశ్నించారు. రైతులు లైన్లో ఉండడం చూడలేకనే ప్రత్యామ్నాయ వ్యవస్థ తెస్తున్నామన్నారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ ఎందుకు తెరిపించలేదని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశ్నించారు. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన చారిత్రక తప్పిదాలపై అబద్దాలు ఆపాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యం నుండి కృష్ణా జలాల పంపకాల వరకు బీఆర్ఎస్ నేతలు అనుసరించిన విధానాలు తెలంగాణ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టుగా మారాయని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నేతలు కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు వారి హయాంలోనే కూలిపోయిందని, అటువంటి ఘోర తప్పిదాన్ని సమర్థించుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. రూ. 1.80 లక్షల కోట్లు అప్పు తెచ్చి నిర్మించిన ప్రాజెక్టు నిరుపయోగం కావడం బీఆర్ఎస్ ఘనతేనని, ఈ ప్రాజెక్టు దేశంలోనే అతిపెద్ద కుంభకోణమని కాగ్ కూడా పేర్కొందని ఆయన గుర్తుచేశారు. ఐదేళ్లలో ఈ ప్రాజెక్టు ద్వారా వినియోగించు కుంది కేవలం 70 నుండి 80 టీఎంసీల నీరు మాత్రమేనని, కేవలం కమిషన్ల కోసమే ప్రాజెక్టు డిజైన్ మార్చారని ఆరోపించారు. కృష్ణా నదీ జలాల పంపిణీ విషయంలో కేసీఆర్, హరీశ్ రావు తెలంగాణకు తీరని అన్యాయం చేశారని మంత్రి విమర్శించారు. 2020లో కృష్ణా బోర్డు సమావేశంలో తెలంగాణకు 33 శాతం నీరు సరిపోతుందని బీఆర్ఎస్ నేతలు రాసివ్వడం వల్లే ఇవాళ ట్రిబ్యునల్ ముందు ఏపీ బలమైన వాదన వినిపిస్తోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే తెలంగాణకు 71 శాతం వాటా కావాలని కేంద్రానికి, ట్రిబ్యునల్‌కు స్పష్టంగా తెలియజేశామని ఆయన వెల్లడించారు. రాయలసీమ ఎత్తి పోతల పథకం విషయంలో కూడా ఏపీతో కుమ్మక్కై, అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేయించుకుని తెలంగాణకు ద్రోహం చేశారని మండిపడ్డారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టును పదేళ్లు అధికారం లో ఉండి ఎందుకు పూర్తి చేయలేదని మంత్రి నిలదీశారు. కనీసం కాలువల తవ్వకం కూడా చేపట్టకుండా, ఒక్క ఎకరానికి కూడా నీరు ఇవ్వకుండా 90 శాతం పనులు పూర్తయ్యాయని అబద్దాలు చెబుతున్నా రని ధ్వజమెత్తారు. కక్షతోనే బ్రాహ్మణ వె÷-లలెంల ప్రాజెక్టును పక్కన పెట్టారని, ఎస్సెల్బీసీ, డిండి వంటి ప్రాజెక్టులను పూర్తి చేయకుండా నల్గొండ జిల్లాకు బీఆర్ఎస్ అన్యాయం చేసిందనిఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుంటుందని, బీఆర్ఎస్ నేతలు చేసిన అప్పులకు నెలకు రూ. 16 వేల కోట్లు వడ్డీ కట్టాల్సి రావడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు సాగునీటి ప్రాజెక్టుల గురించి మాట్లాడే ముందు తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, అక్రమంగా సంపాదించిన సొమ్మును జేబుల్లో నింపుకున్నారని మంత్రి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.



## జనవరి 13 నుంచి కైట్ ఫెస్టివల్

- ఫెస్టివల్ ఏర్పాట్లపై సిఎస్ సమీక్ష
- పునరుద్ధరించిన చెరువుల వద్ద ఉత్సవాలకు సూచన

**హైదరాబాద్, డిసెంబర్ 22 :** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని హైదరాబాద్ నగరంలో వచ్చే నెల 13వ తేదీ నుంచి కైట్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. దీని ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సంక్రాంతి పండుగ వాతావరణానికి తగిన విధంగా హైదరాబాద్ నగరపు సాంస్కృతిక వైభవం ప్రతిబింబించేలా కైట్ ఫెస్టివల్ ను ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఈ కైట్ ఫెస్టివల్ కు ప్రత్యేక గుర్తింపు, విస్తృత ప్రచారం కల్పించేలా సరైన పేరు, ప్రత్యేక బ్రాండింగ్, ఆకర్షణీయమైన లోగోను రూపొందించాలని సంబంధిత శాఖలను ఆయన ఆదేశించారు. హైడ్రా ద్వారా పునరుజ్జీవింపబడిన చెరువుల వద్ద ఈ కైట్ ఫెస్టివల్‌ను నిర్వహించాలని గౌరవ ముఖ్యమంత్రి ఆకాంక్షను సిఎస్ తెలిపారు. దీని ద్వారా నగరంలోని నీటి వనరుల పునరుద్ధరణలో సాధించిన విజయాలను ప్రజలకు తెలియజేయడం లక్ష్యమని ఆయన అన్నారు. గుర్తించిన ప్రదేశాల్లో కైట్ ఫెస్టివల్‌కు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించి సమన్వయం చేయడానికి జిహెచ్ఎంసి హెచ్ఎండిఎ, హైడ్రా తరఫున ఒక్కొక్క ప్రత్యేక అధికారిని నియమించాలని ఆయన ఆదేశించారు. జనవరి మొదటి వారం నుంచి మంత్రులు పునరుద్ధరించబడిన చెరువులను సందర్శించి ఏర్పాట్లను సమీక్షిస్తారని ఆయన తెలిపారు. మావేశంలో హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ నగరవ్యాప్తంగా హైడ్రా ద్వారా పునరుజ్జీవింపబడిన చెరువులపై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. నీటి నిల్వ సామర్థ్యం పెంపు, పర్యావరణ స్థిరత్వం , ప్రజాప్రయోజనాల కోసం చేపట్టిన పునరుద్ధరణ పనులను వివరించారు.




## జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజన

**జోక్యం చేసుకోలేమన్న హైకోర్టు**

**హైదరాబాద్, డిసెంబరు 22 :** జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజనను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. వాదనలు విన్న ధర్మాసనం.. ఈ విషయంలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. జీహెచ్ఎంసీలో డివిజన్ల సంఖ్యను 150 నుంచి 300కు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దీనిని సవాల్ చేస్తూ ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. ఎంసీహెచ్ఆర్డీలో సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సమర్పించిన నివేదిక ఆధారంగా వార్డుల పునర్విభజన చేశామని ప్రభుత్వం చెబుతున్నా.. ఆ నివేదికను బయటపెట్టలేదని, అభ్యంతరాల స్వీకరణకు తగినంత గడువు ఇవ్వలేదని పిటిషనర్ తరఫు న్యాయవాదులు వాదించారు. చట్టపరిధిలోనే డీలిమిటేషన్ నోటిఫికేషన్‌ను జారీ చేసినట్లు ప్రభుత్వం తరఫు న్యాయవాది బుధవారమే కోర్టుకు వివరించారు. సమాచారం ఇప్పటికే వెబ్‌సైట్‌లో ఉంచామని, ఇప్పటివరకు అందిన 3,100 అభ్యంతరాలు పరిష్కరిస్తున్నామన్నారు.

## జీహెచ్ఎంసీ వన్‌టైమ్ సెటిల్‌మెంట్

**ఆస్తిపన్ను చెల్లింపులో 90శాతం వడ్డీ రాయితీ**

**హైదరాబాద్, డిసెంబరు 22 :** భాగ్యనగరవాసులకు జీహెచ్ఎంసీ కమిషనర్ తీపి కబురు అందించారు. దీర్ఘకాలంగా ఆస్తి పన్ను బకాయిలు ఉన్న వారికి ఊరటనిస్తూ 'వన్ టైమ్ సెటిల్మెంట్' పథకాన్ని ప్రకటించారు. ఈ స్కీమ్ కింద పాత బకాయిలపై పేరుకుపోయిన వడ్డీలో ఏకంగా 90 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు వెల్లడించారు. చాలా కాలంగా ఆస్తి పన్ను చెల్లించని ఆస్తులపై భారీగా వడ్డీ పేరుకు పోయింది. పన్ను చెల్లింపుదారుల విజ్ఞప్తి మేరకు, 2025?26 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ రాయితీని ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. ఈ పథకం ప్రకారం.. పన్ను చెల్లింపుదారుడు తన అసలు పన్ను మొత్తాన్ని చెల్లిస్తూ, దానిపై ఉన్న వడ్డీలో కేవలం 10 శాతాన్ని మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. మిగిలిన 90 శాతం వడ్డీని కార్పొరేషన్ పూర్తిగా మాఫీ చేస్తుంది. ఈ వన్ టైమ్ సెటిల్మెంట్ స్కీమ్ కేవలం ప్రైవేట్ వ్యక్తులకు మాత్రమే కాకుండా, ప్రభుత్వ ఆస్తులకు కూడా వర్తిస్తుందని కమిషనర్ స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయ పరిధితో పాటు, ఇటీవల గ్రేటర్ హైదరాబాద్‌లో కలిసిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు మరియు గ్రామ పంచాయతీల పరిధిలోని ఆస్తులన్నింటికీ ఈ రాయితీ వర్తిస్తుంది. పన్ను బకాయిలు ఉన్న యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



## గోవా పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం

**ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన ప్రధాని మోడీ**

**పనాజి, డిసెంబరు 22 :** గోవా జిల్లా పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ఘన విజయం సాధించడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. సుపరిపాలన, ప్రగతిశీల రాజకీయాలకు ప్రజలు ఇచ్చిన తీర్పు ఇదని ప్రశంసించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. 'సుపరిపాలనకు గోవా ప్రజలు అండగా నిలిచారు. ప్రగతిశీలక రాజకీయాలకు పట్టం కట్టారు. జిల్లా పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ-ఎంజీపీ (ఎన్డీయే) కుటుంబానికి బలమైన మద్దతు ఇచ్చిన నా సోదరులకు, సోదరీమణులకు కృతజ్ఞతలు' అని అన్నారు. గోవా అభివృద్ధి దిశగా ఎన్డీయే చేస్తున్న ప్రయత్నాలకు ప్రజాతీర్పు మరింత ఉత్సాహాన్ని ఇచ్చిందని, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం పునరకింతమవుతుందని పేర్కొన్నారు. ఇంతటి ఘనవిజయానికి కారణమైన కార్యకర్తలను ప్రధాని అభినందించారు. జిల్లా పంచాయతీ ఎన్నికల్లో బీజేపీపై నమ్మకం ఉంచి ఘన విజయం అందించిన ఓటర్లకు ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ-ఎంజీపీ కూటమి నుంచి గెలుపొందిన అభ్యర్థులను అభినందించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వంపై ప్రజలు నిర్ణయాత్మక తీర్పునిచ్చారని అన్నారు. 'గోవాలో బీజేపీ నెంబర్ 1. ఇంతటి ఘనవిజయంతో బీజేపీని ఆశీర్వదించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు' అని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో సీఎం పేర్కొన్నారు. గోవా జిల్లా పంచాయతీ ఎన్నికల ఫలితాలు సోమవారంనాడు వెలువడ్డాయి. మొత్తం 50 సీట్లలో 30 సీట్లు బీజేపీ గెలుచుకుని ఏకైక పెద్ద పార్టీగా నిలిచింది. కాంగ్రెస్ పార్టీ 8 సీట్లు, స్వతంత్ర అభ్యర్థులు 5 సీట్లు గెలుచుకున్నారు. మహారాష్ట్ర గోమంతక్ పార్టీ (ఎండీపీ) రెండు స్థానాల్లో గెలుపొందగా, గోవా ఫార్వార్డ్ పార్టీ (జీఎఫ్‌పీ), ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), రివల్యూషనరీ గోన్స్ పార్టీ (ఆర్‌జీపీ) ఒక్కో సీటు చెప్పున గెలుచుకున్నాయి. బీజేపీ ఈ ఎన్నికల్లో ఎంజీపీతో కలిసి పోటీ చేయగా, జీఎఫ్‌పీ పొత్తుతో కాంగ్రెస్ పోటీ చేసింది. 2027లో గోవా అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా, 2012 నుంచి రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉంది.

## నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ సవాల్

- ట్రయల్ కోర్టు ఉత్తర్వులపై హైకోర్టులో పిటిషన్
- సోనియా, రాహుల్‌కు నోటీసులు..
- మార్చి12కు విచారణ వాయిదా




**న్యూఢిల్లీ, డిసెంబరు 22 :** నేషనల్ హెరాల్డ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈడీ ఛార్జిషీటుపై ట్రయిల్ కోర్టు ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులను దర్యాప్తు సంస్థ హైకోర్టులో సోమవారంనాడు సవాలు చేసింది. దీంతో కేసులో నిందితులైన కాంగ్రెస్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ తదితరులకు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. ఈడీ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసులో ఈడీ దర్యాప్తు పూర్తి చేసిందని, సాక్ష్యాలను సేకరించిందని, కేసులో భాగంగా పలుచోట్ల సోదాలు కూడా జరిపిందని చెప్పారు. ఈడీ ఛార్జిషీటును పరిగణనలోకి తీసుకోకుండా దిగువ కోర్టు తప్పు చేసిందని ఆయన వాదించారు. ఈ కేసుపై తదుపరి విచారణను వచ్చే మార్చి 12వ తేదీకి హైకోర్టు వాయిదా వేసింది. నేషనల్ హెరాల్డ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన చార్జిషీటును పరిగణనలోకి తీసుకునేందుకు ఢిల్లీ కోర్టు గత మంగళవారంనాడు నిరాకరించింది. చార్జిషీటును తిరస్కరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా కాకుండా, ప్రైవేటు వక్తి సుబ్రమణ్యం స్వామి దాఖలు చేసిన ఫిర్యాదు ఆధారంగా చార్జిషీటును పరిగణనలోకి తీసుకోలేమని ఢిల్లీ కోర్టు ప్రత్యేక జడ్జి విశాల్ గాగ్నే తప్పుపట్టారు. చట్టం ప్రకారం దీన్ని విచారించడం సాధ్యం కాదన్నారు. ఢిల్లీ పోలీసు శాఖకు చెందిన ఆర్థిక నేరాల విభాగం ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని ప్రత్యేక న్యాయమూర్తి గుర్తుచేశారు. అలాంటప్పుడు ఈడీ చార్జిషీటు ఆధారంగా తీర్పు ఇవ్వడం తొందరపాటే అవుతుందని అభిప్రాయ పడ్డారు. అయితే ఈ కేసులో ఈడీ దర్యాప్తును కొనసాగించవచ్చని కోర్టు ఆదేశాలిచ్చింది.

## కేటీఆర్‌ను ఎలా ఫుట్‌బాల్ ఆడాలో రేవంత్‌కు తెలుసు

**కేటీఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రి సీతక్క**



**హైదరాబాద్, డిసెంబరు 22 :** ఫుట్ బాల్ ఆడుకోవడం సిఎం రేవంత్‌కు బాగా తెలుసని, కేటీఆర్‌ను ఎలా ఫుట్ బాల్ ఆడుకోవాలో అలా ఆడుకుంటాడని కేటీఆర్‌ను ఉద్దేశించి మంత్రి సీతక్క సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌ను ఫుట్‌బాల్ ఆడుకుంటామన్న కెటిఆర్ వ్యాఖ్యలపై సీతక్క ఘాటుగా స్పంఇంచారు. సోమవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలు ఎప్పుడో బీఆర్ఎస్‌ను ఫుట్‌బాల్ ఆడుకున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రపంచ ఆటగాడితోనే ఫుట్‌బాల్ ఆడినట్లు తెలిపారు. కేటీఆర్‌తో ఫుట్‌బాల్ ఎట్లా ఆడాలో సీఎం రేవంత్ రెడ్డికి తెలుసన్నారు. అధికారం పోయిందని అక్కసుతో హరీష్ రావు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. హరీష్ రావుకు మించి తప్పుడు కూతలు, తప్పుడు మాటలు, గ్లోబల్ ప్రచారం ఎవరు చేయరని విమర్శించారు. అధికారం పోయాక ఎవరో వాళ్ళ ఇంట్లో పడి గుంజుకున్నట్టుగా ఫీలై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రజలు బీఆర్ఎస్‌కు 10 సంవత్సరాలు అవకాశం ఇచ్చారని.. సరిగా పని చేయకపోతే ప్రజలు అధికారం నుంచి దింపేశారన్నారు. ఇప్పుడు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారన్నారు. కాంగ్రెస్ మంచిగా పని చేయనప్పుడు కాంగ్రెస్‌ను కూడా దించుతారని అన్నారు. కవితకు జవాబు చెప్పలేక కాంగ్రెస్ పార్టీ మీద పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలతో తాము పాజిటివ్ దృక్పథంతో ఉంటామని స్పష్టం చేశారు. తప్పుడు మాటలు మాట్లాడితే ఫుట్‌బాల్ ఆడుకుంటామని మంత్రి సీతక్క హెచ్చరించారు.




## సుక్మాలో నక్సల్స్ స్థావరం ధ్వంసం

**సుక్మా :** ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో భద్రతా బలగాలు నక్సల్స్ స్థావరాన్ని ధ్వంసం చేశాయి. సీఆర్పీఎఫ్ 150 బెటాలియన్ నేతృత్వంలో సుక్మా అడవుల్లో ఆపరేషన్ చేపడుతున్న సందర్భంలో మావోయిస్టుల స్థావరాన్ని గుర్తించాయి. స్వాధీనం చేసుకున్న వస్తువులలో వైద్య పరీక్షా సాధనాలు, కంటి పరీక్ష యంత్రం, ఐఓఎల్ మాస్టర్ ఆప్టో మీటర్, కంటి పరీక్ష లెన్స్ కిట్ ఉన్నాయి. టిన్ ప్లేట్లు, ఐఈడీ తయారీ సామగ్రి, తుపాకులు, ఇనుము కటింగ్ యంత్రం, ఫోల్డబుల్ అల్యూమినియం వంటి ఇతర వస్తువులను కూడా స్వాధీనం చేసుకున్నారు.

## తల్లీకుమార్తెలపై అత్యాచార ఘటన.. నిందితులకు జీవిత ఖైదు

**ఉత్తర్‌ప్రదేశ్ :** దాదాపు పదేళ్ల క్రితం దేశంలో సంచలనం సృష్టించిన తల్లీకుమార్తెల అత్యాచార ఘటనలో సోమవారం తుది తీర్పు వెలువడింది. 2016లో బులంద్‌షహర్‌లో జరిగిన ఈ అమానవీయ ఘటనలో ఇప్పటికే ఐదుగురిని దోషులుగా తేల్చిన న్యాయస్థానం.. వారికి జీవితఖైదు విధిస్తూ తీర్పు వెలువరించింది. జులై 28, 2016 రాత్రి సమయంలో ఢిల్లీ- కాన్పూర్ హైవేపై కారులో వెళ్తున్న ఓ కుటుంబాన్ని ఉత్తర్‌ప్రదేశ్‌లోని బులంద్‌షహర్ ప్రాంతంలో గుర్తుతెలియని దుండగులు అడ్డుకున్నారు. వారి దగ్గర ఉన్న ఇనుపరాడ్డులతో కారును ధ్వంసం చేసి.. కారులో ఉన్న వారిని బెదిరించి, నగదు దోచుకున్నారు. అనంతరం మిగిలిన కుటుంబసభ్యులను బంధించి తల్లి, ఆమె 14 ఏళ్ల కుమార్తెపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ కేసులో పోలీసులు తొలుత ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేయగా వారికి ఎలాంటి సంబంధం లేదని దర్యాప్తులో తేలింది. ఈ కేసు అప్పట్లో ఉత్తర్‌ప్రదేశ్‌లో తీవ్ర దుమారం రేపింది. దీంతో అలహాబాద్ హైకోర్టు ఈ కేసును సీబీఐకి అప్పగించింది. అనంతరం దర్యాప్తు చేపట్టగా.. బవేరియా ముఠాకు చెందిన ఆరుగురు వ్యక్తులు ఈ దారుణానికి ఒడిగట్టినట్లు గుర్తించారు. రెండేళ్ల తర్వాత 2018లో నిందితులను అరెస్టు చేసి సీబీఐ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఈ కేసు పెండింగ్‌లో ఉండగానే.. నిందితుల్లో ఒకరు కస్టడీలో మరణించాడు. కొన్నేళ్ల పాటు సాగిన ఈ విచారణ అనంతరం ఇటీవల పోక్సో కోర్టు ఈ కేసులో ఐదుగురిని దోషులు తేల్చింది. తాజాగా వారికి జీవితఖైదు విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ కేసులో డీఎన్ఏ కీలక సాక్ష్యంగా ఉన్నట్లు బాధితుల తరఫు న్యాయవాది వెల్లడించారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం

**మంచిర్యాలలో ముగ్గురు, ఖమ్మంలో ఒకరు మృతి**




**మంచిర్యాల/ఖమ్మం, డిసెంబర్ 25 :** రోడ్డు ప్రమాదాలు రోజు రోజుకు పెరిగిపోతూనే ఉన్నాయి. అధిక వేగం, నిర్లక్ష్యమైన డ్రైవింగ్ కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగి అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన వారు తిరిగి వచ్చే వరకు నమ్మకం లేకుండాపోతున్న పరిస్థితి. అసలు ప్రమాదం ఎక్కడి నుంచి వస్తుందో తెలియడం లేదు. పెద్ద ప్రమాదాలు జరిగి ప్రాణాలతో బయటపడి మృత్యుంజయులుగా ఉన్న వారు ఎందరో ఉండగా.. చిన్న ప్రమాదాలకు ప్రాణాలు కోల్పోయిన వారు ఉన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టినా కూడా ఎక్కడో చోట ప్రమాదాలు జరిగి అనేక మంది మరణిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం మంచిర్యాల, ఖమ్మంలలో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృత్యువాత పడ్డారు. తాజాగా మంచిర్యాలలో జరిగిన రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. జిల్లాలోని ఇందారం క్రాస్ రోడ్డు వద్ద సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న బొలెరోను వేగంగా దూసుకొచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. వరి నాట్లు వేసేందుకు మహారాష్ట్ర నుంచి కరీంనగర్ జిల్లాకు 23 మంది కూలీలు బొలెరోలు వెళున్నారు. ఈ క్రమంలో ఇందారం క్రాస్ వద్ద బొలెరో వాహనం కొద్దిసేపు ఆగింది. ఇంతలో అనుకోని ప్రమాదం వారిని వెంటాడింది. ఓ లారీ అతి వేగంగా దూసుకొచ్చి బొలెరోను ఢీకొట్టింది. దీంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన వారిని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఖమ్మం రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన సోమవారం ఎదులాపురం మున్సిపాలిటీలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాయిడుపేట బైపాస్ రోడ్డు నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న పాముల కేశవులు అనే ద్విచక్ర వాహనదారుడిని ఖమ్మం నుంచి నాయుడు పేట వైపుగా వస్తున్న ఆర్టిసి బస్సు ఢీ కొట్టింది. దింతో తీవ్ర గాయాలపాలైన కేశవులు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఖమ్మం రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ వైద్యాశాల మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సవాళ్లు ఎవరి ప్రయోజనాల కోసం!



**రాష్ట్రం విభజన జరిగి 12 ఏళ్లు కావస్తోంది. అంటే పుష్కరకాలం గడిచింది. ఇరు తెలుగు రాష్ట్రాల్లో సాధించింది సున్నా. ఓ రకంగా చెప్పాలంటే విభజన వల్ల రాజకీయ పార్టీలు, కొందరు నేతలు బాగుపడ్డారు తప్ప ప్రజలు ఏ విషయంలోనూ బాగుపడలేదు. వారికి ఎలాంటి ఉపయోగం కలగలేదు. అయినా రాష్ట్రాలను బాగు చేయకుండా ప్రజలను మభ్యపెడుతూ సవాళ్లు విసురుకుంటూ..జనాలను మోసం చేస్తున్నారు. అక్కడ చంద్రబాబు, జగన్ సవాళ్లు, ఇక్కడ కెసిఆర్ బృందం, రేవంత్ బృందం పరస్పర సవాళ్లతో కాలం గడుపుతున్నారు. తామంతా మంచే చేశామని, పాలన బ్రహ్మండంగా చేసామని ఇరు రాష్ట్రాల సిఎంలు, సిఎంలుగా పనిచేసిన వారు చెప్పకుంటున్నారు. మధ్యలో రాండి చర్చిద్దాం..అంటూ సవాళ్లు విసురుకుంటున్నారు. ఉచిత పథకాలతో ప్రజలను బురిడీ కొట్టించడం తప్ప వీరు చేసిన పాలనలో గొప్పతనం ఏదీ లేదు. పైగా రెండు రాష్ట్రాలు అప్పల్లో కూరుకుపోయాయి.**


ఉమ్మడి ఏపీ కన్నా విడిపోయాక రెండు తెలుగు రాష్ట్రాలు దగపడ్డాయి. ఇకపోతే తాజాగా కెసిఆర్ మరోమారు మీడియా ముందుకు రావడం, నదీజలాలపై మాట్లాడడం, సర్కార్‌కు సవాల్ విసరడంతో ఇప్పుడు మరోమారు తెలంగాణలో సవాళ్ల పర్వ నడుస్తోంది. కృష్ణా జలాల విషయంలో ఉమ్మడి రాష్ట్రంలో కంటే కేసీఆర్ పదేళ్ల పాలనలోనే తెలంగాణకు ఎక్కువ అన్యాయం జరిగిందన్న కాంగ్రెస్ ప్రభుత్వ వాదనగా ఉంది.. కృష్ణా జలాల్లో ఏపీకి 511 టీఎంసీలు (64 శాతం),తెలంగాణకు 299 టీఎంసీలు (36 శాతం) చాలని సంతకం పెట్టింది కేసీఆరే అని, ఆ సంతకంతో మహబూబ్‌నగర్, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాలకు మరణ శాసనం రాసిందీ ఆయనే అని రేవంత్ సర్కార్ విమర్శిస్తోంది. ఆ పాపానికి ప్రజలకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలి. ఉమ్మడి రాష్ట్రం కంటే కేసీఆర్ సీఎంగా ఉన్న పదేళ్లలోనే తెలంగాణకు నీటి విషయంలో ఎక్కువ నష్టం జరిగింది. కాంగ్రెస్ హయాంలో ప్రారంభ మైన భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, కల్వకుర్తి, పాలమూరు- రంగారెడ్డి, డిండి, ఎస్ఎల్‌బీసీ, సీతారామసాగర్, కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకం... ఇలా కృష్ణా నదిపై ఉన్న ఒక్క ప్రాజెక్టును కూడా పదేళ్లలో పూర్తిచేయలేకపోయారని విమర్శలు అందుకున్నారు. అసలు కృష్ణా, గోదావరి జలాల విషయంలో ఇప్పటివరకు ఎప్పుడేం జరిగింది? ఎవరేం చేశారు? అని చర్చించేందుకు జనవరి రెండో తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు పెడతామని, కేసీఆర్ రావాలి. చర్చలో పాల్గొనాలి. ఒకరోజు కృష్ణా జలాల మీద, మరో రోజు గోదావరి జలాలపై చర్చిద్దాం అని కూడా కరేవంత్ అంటున్నారు. తెలంగాణకు ద్రోహం చేసిందే కేసీఆర్ అని... అసెంబ్లీకి వస్తే ఆ ద్రోహిని నిలదీస్తామని కూడా సవాల్ విసిరారు.

అంతేగాకుండా కేసీఆర్ క్రియాశీల రాజకీయాల్లో లేరని, సభకు వచ్చి చర్చిస్తేనే ఉన్నట్లని వ్యాఖ్యానించారు. రోడ్డు మీద కాదు... అసెంబ్లీలో నీళ్లు-నిజాలపై చర్చిద్దామని సూచించారు. ఇక కెసిఆర్ వ్యవహార శైలి మరోలా ఉంది. కృష్ణాజలాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దొంగాటను, రెండేండ్ల కాంగ్రెస్ పాలనా వైఫల్యాలను కేసీఆర్ ఏకరువు పెట్టారు. పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల ప్రజల జీవన్మరణ సమస్య అన్నారు.ప్రజలను ఏమార్చినంత సులువుగా పాలన చేయడం చేతిగాని విఫల నేత అని పరోక్షంగా రేవంత్‌పై విరుచుకుపడ్డారు. ఇంతకాలం నోరు తెరిస్తే చావు శకునాలు, నెత్తుటి కూతలు కూసిన బేతాళ మాటలను కేసీఆర్ తన ప్రసంగంలో ప్రస్తావించారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాలపై రెండేండ్ల నుంచి నేను మౌనం పాటించి చూసుకుంటూ వస్తున్నట్లు వెల్లడించారు. తప్పని పరిస్థితుల్లో ఇప్పుడు నేను బయలుదేరాను. ప్రజల మధ్యలో అటు కేంద్రాన్ని ఎక్స్‌పోజ్ చేస్తం. ఇటు రాష్ట్ర ప్రభుత్వాన్ని కచ్చితంగా ఎండగడుతం. చాలా పెద్ద ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడుతం అని ప్రకటించారు. పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో గ్రామగ్రామాన సభలు పెడుతం. ప్రజా ఉద్యమాలు చేస్తం. పెద్ద బహిరంగ సభలు పెడుతం. బహిరంగ సభలకు నేను స్వయంగా అటెండ్ అవుతున్నా. ప్రజాక్షేత్రంలో ఈ ప్రభుత్వ నిష్క్రియా పరత్వాన్ని ఎండగడుతం అని కేసీఆర్ ప్రకటించారు. మా హయాంలో ఈ రాష్ట్రం ఒక పద్ధతి ప్రకారం ముందుకు నడిచింది. సంక్షేమం, అభివృద్ధి, పారిశ్రామికం, ఐటీ రంగం, క్రైమ్ తగ్గింపు, లాండ్ అండ్ ఆర్డర్ నిర్వహణలో మంచి పద్ధతిలో ముందుకు పోయింది. ఇప్పుడు మానభంగాలు, నడి రోడ్డుపై హత్యలు జరుగుతున్నా అడిగే దిక్కులేదు.

అప్పుడు పీస్ ఫుల్ స్టేట్ ఉండె.. ఇప్పుడవన్నీ మాయమై నయని అన్నారు. యూరియా సప్లయ్ చేసే తెలివి లేదా వీళ్లకు? మా గవర్నమెంట్ ఉన్నప్పుడు రైతులు ఆటోకు డబ్బులిచ్చి పది బస్తాలు తెచ్చియ్యి బాబూ అంటే.. తెచ్చి ఎకడో పొలంకాడ పడేస్తుండె. ఇవ్వాల రైతులు రోజుల తరబడి లైన్లలో చెప్పులు పెడుతున్నరు. రాష్ట్రం ఏర్పడక ముందు చెప్పుల లైన్లు ఉండె. బీఆర్ఎస్ ఉన్నన్ని రోజులు చెప్పుల లైన్లు మాయమైనయ్. కాంగ్రెస్ రాగానే మళ్లీ చెప్పుల లైన్లు స్టార్ట్ అయినయ్ అంటూ విమర్శలు సంధించారు. ఎంతసేపు రియల్ ఎస్టేట్ దందా తప్ప పాలమూరుకు రెండేండ్ల నుంచి రూపాయి పెట్టలేదు. తట్టెడు మట్టి తీయలేదు. వెనుక ఎవరి ఒత్తిడి ఉన్నది? ఎవరి ప్రయోజనాలు కోరుతున్నట్టు అని నిలదీసారు. 10 టీఎంసీలకు మా గవర్నమెంట్ ప్రాజెక్టు కోసం డీపీఆర్ పంపింది. ఇప్పుడేమో ఆ డీపీఆర్ తిప్పి పంపించిండ్రు.. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడటం చేతకాకపోతే, రాష్ట్రానికి వస్తున్న నీళ్లను కూడా కాపాడే పరిస్థితి లేకపోతే.. ఇదేం దద్దమ్మ ప్రభుత్వం? కేంద్రం మొత్తం డీపీఆర్ పంపిస్తే ప్రాజెక్టుని ఆగం చేసే పరిస్థితి వస్తే.. వీళ్ల నుంచి సప్పుడులేదంటూ కెసిఆర్ తనదైన శైలిలో విరుచుకు పడ్డారు. మొత్తానికి ఇప్పుడు పరస్పర సవాళ్లు తప్ప పాలనపై ఎలాంటి సూచనలు లేవు. మధ్యలో ప్రజలు ఆగమవుతున్నారు. రాష్ట్రం అప్పులపాలు అవుతోంది. ఇదంతా నాయకత్వ లోపంగానే చూడాలి. ఇందులో గతంలో పాలించిన, ఇప్పుడు పాలిస్తున్న వారే బాధ్యులు. అప్పుల గురించి చర్చించాలి. నీటి వాటాలపైనా చర్చించాలి. అయితే మేధావుల సమక్షంలో అసెంబ్లీ బయట చర్చిస్తే మంచింది.

## భారత్, న్యూజిలాండ్‌ల మధ్య
# స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

### ఇరు దేశాల మధ్య కుదరిన ఒప్పందం



**న్యూఢిల్లీ, డిసెంబర్ 22 :** భారత్, న్యూజిలాండ్‌లు ఇరు దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. భారత్-న్యూజిలాండ్‌ల మధ్య సమగ్ర స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం జరిగిన చర్చలు విజయవంతంగా ముగిశాయి. ఈ మేరకు భారత ప్రధాని మోడీ, న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్‌లు ఫోన్ సంభాషణల అనంతరం సోమవారం ప్రకటించారు. ఇప్పటికే భారత్ పలు దేశాలతో ఎఫ్‌టిఎ (స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం)ను కుదుర్చుకుంది. గత కొన్ని సంవత్సరాల్లో భారత్ ఒమన్, యుకె, ఇఎఫ్‌టిఎ దేశాలు, యుఎఇ, ఆస్ట్రేలియా, మారిషస్ దేశాలతో వాణిజ్య ఒప్పందాల తర్వాత తాజాగా న్యూజిలాండ్‌తో కుదర్చుకున్నది ఏడవ ఒప్పందం. '9 నెలల సమయంలో ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన చర్చలు ముగిశాయి. ఈ ఒప్పందం రెండు దేశాల మధ్య సంబంధాలను మరింతగా పెంచుకోవాలనే ఉమ్మడి ఆశయం, రాజకీయ సంకల్పాన్ని ప్రతిబింబిస్తుంది. ఎఫ్‌టిఎపై ఇద్దరు నాయకులు అంగీకరించారు అని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈూగా, ఈ స్వేచ్ఛావాణిజ్యం ఒప్పందం ద్వారా ఇరు దేశాల మధ్య ఆర్థిక సంబంధాలను గణనీయంగా పెంచుతుంది. మార్కెట్‌ను మెరుగుపరుస్తుంది. పెట్టుబడి ప్రవాహాలను ప్రోత్సహిస్తుంది. వ్యూహాత్మక సహకారాన్ని బలోపేతం చేస్తుంది. అలాగే ఇరు దేశాల్లో వివిధ రంగాలలోని ఆవిష్కర్తలు, వ్యవస్థాపకులు, రైతులు, ఎంఎస్‌ఎంఇలు, విద్యార్థులు, యువతకు కొత్త అవకాశాల్ని కల్పిస్తుంది. రాబోయే ఐదు సంవత్సరాల్లో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయడంతోపాటు, రాబోయే 15 సంవత్సరాలలో న్యూజిలాండ్ నుండి భారత్‌లో 20 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడి సాధించడంపై ఇరువురు నేతలు విశ్వాసం వ్యక్తం చేసినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. న్యూజిలాండ్ నుండి భారత్‌కి అయ్యే ఎగుమతులకు 95 శాతం సుంకాలను తగ్గిస్తుందని న్యూజిలాండ్ ప్రధాని లక్సన్ సోషల్‌మీడియా ద్వారా ప్రకటించారు. ఈ ఒప్పందం వల్ల రాబోయే రెండు దశాబ్దాల్లో న్యూజిలాండ్ నుంచి భారత్‌కి ఎగుమతులు 1.1 నుంచి 1.3 బిలియన్ డాలర్ల మేర పెరుగుతాయని అంచనా. వాణిజ్యాన్ని పెంచడం ద్వారా కివీ ఉద్యోగాలు, అధిక వేతనాలు, కష్టపడి పనిచేసే న్యూజిలాండ్‌వాసులకు మరిన్ని అవకాశాలు లభిస్తాయి అని న్యూజిలాండ్ ప్రధాని ప్రకటనలో తెలిపారు. ఇరు దేశాల మధ్య బలమైన స్నేహానికి సాక్ష్యమే ఈ ఒప్పందమని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ ఏడాది మార్చిలో లక్సన్ భారత్ పర్యటనకు వచ్చారు. అప్పుడు ప్రధానితో వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరిపారు. నాలుగుసార్లు చర్చలు జరిపిన తర్వాత ఇరుదేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది.

## అసోం రాజధాని
# గౌహతిలో శ్రీవారి ఆలయం

### 25 ఎకరాలు కేటాయించేందుకు ప్రభుత్వం అనుమతి



**తిరుమల, డిసెంబర్ 25 :** కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామివారి వైభవాన్ని ఈశాన్య భారతదేశంలో మరింత విస్తరించే దిశగా కీలక ముందడుగు పడింది. గువాహటి నగరంలో శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రం నిర్మాణం సాకారం కానుంది. అసోంలో అద్భుత దేవాలయ నిర్మాణానికి అక్కడి ప్రభుత్వం సహకారం అందించనుంది. ఆలయ నిర్మాణానికి తొలుత నిర్ణయించిన 10.8 ఎకరాల భూమికి బదులుగా 25 ఎకరాల భూమిని కేటాయించేందుకు అస్సాం ప్రభుత్వం నిర్ణయించింది. అస్సాం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య జరిగిన సంప్రదింపుల అనంతరం ఈ కీలక నిర్ణయం వెలువడింది. గువాహటి సమీపంలోని కామ్రూప్ మెట్రోపాలిటన్ జిల్లాలో 10.8 ఎకరాల భూమిని కేటాయించేందుకు అస్సాం ప్రభుత్వం గతంలోనే అంగీకారం తెలిపింది. అయితే డిసెంబర్ 7న అస్సాం ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి కేకే ద్వివేది టీటీడీ ఛైర్మన్‌కు లేఖ రాస్తూ గువాహటిలోని గర్చుక్ ప్రాంతంలో ఇప్పటికే ఉన్న శ్రీవారి ఆలయం మరియు సాంస్కృతిక సముదాయం నిర్వాహకుల సూచనలను ఛైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. కామ్రూప్ మెట్రోపాలిటన్ జిల్లాలో టీటీడీ శ్రీ వేంకటేశ్వర ఆలయం నిర్మిస్తే, అక్కడ ఉన్న ఆలయ ప్రయోజనాలకు భంగం కలగవచ్చని వారు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో శ్రీ వేంకటేశ్వర ఆలయాన్ని అస్సాంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న సిల్చార్ లేదా డిబ్రూగఢ్ నగరాల్లో ఏర్పాటు చేయాలని అస్సాం సీఎం అదనపు ప్రధాన కార్యదర్శి సూచించారు. ఈ విషయాన్ని టీటీడీ ఛైర్మన్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన ఈనెల 18న అస్సాం ముఖ్యమంత్రి డాక్టర్ హిమంత బిశ్వ శర్మకు లేఖ రాశారు. దేశంలోని ప్రతి రాష్ట్రం మరియు కేంద్రపాలిత ప్రాంతంలో కనీసం ఒక శ్రీ వేంకటేశ్వర ఆలయాన్ని స్థాపించడం ద్వారా హిందూ సనాతన ధర్మం, శ్రీ వేంకటేశ్వర స్వామివారి మహిమను విస్తరించాలన్నది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు టీటీడీ నిబద్ధతగా ఆ లేఖలో పేర్కొన్నారు. ఆంధప్రదేశ్ కొత్త రాజధాని అమరావతిలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 25 ఎకరాల భూమిని కేటాయించిన విషయాన్ని అస్సాం ముఖ్యమంత్రికి గుర్తు చేస్తూ, సిల్చార్ లేదా డిబ్రూగఢ్ బదులుగా అస్సాం రాజధాని గువాహటిలోనే టీటీడీకి 25 ఎకరాల భూమి కేటాయించాలని సీఎం చంద్రబాబు కోరారు. ఈశాన్య భారతదేశానికి గువాహటి ప్రధాన కేంద్రంగా ఉన్నందున, భక్తుల సౌకర్యాలు, నిత్య అన్నదానం వంటి ధార్మిక కార్యక్రమాలతో కూడిన దివ్యక్షేత్రాన్ని ఏర్పాటు చేయడానికి సుమారు 25 ఎకరాల భూమిని కేటాయించాలని సిఫార్సు చేశారు. అలాగే ప్రతిపాదిత స్థలంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అస్సాం ప్రభుత్వం ఆర్థిక సహకారం కూడా అందించాలని ఏపీ సీఎం తన లేఖలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చేసిన సూచనలకు సానుకూలంగా స్పందించిన అస్సాం ముఖ్యమంత్రి గువాహటిలోనే టీటీడీకి 25 ఎకరాల భూమిని కేటాయించేందుకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారు. అలాగే ప్రతిపాదిత ప్రాజెక్టు అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని కూడా అందించేందుకు అంగీకరించారు. ఈ అంశాన్ని సౌహార్దపూర్వకంగా పరిష్కరించినందుకు ఆంధ్రప్రదేశ్, అస్సాం రాష్ట్రాల ముఖ్యమంత్రులకు టీటీడీ ఛైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు. భూమి కేటాయింపునకు సంబంధించిన విధివిధానాలను పూర్తి చేసి, ఈశాన్య భారతదేశంలో తొలి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభించేందుకు అస్సాం ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటామని తెలియజేశారు.

# రన్‌వేపై నేలపై కూర్చుని పరీక్ష

### ఒడిషా ఘటనపై సోషల్ మీడియాలో వైరల్



**భువనేశ్వర్, డిసెంబర్ 22 :** ప్రభుత్వ ఉద్యోగం కోసం వేలాది మంది అభ్యర్థులు ఎయిర్‌పోర్ట్ రన్‌వైపై నేలపై కూర్చుని పరీక్ష రాశారు. రన్‌వేపై పరీక్షా అని ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. ఇటీవల ఒడిశాలో జరిగిన ఈ ఘటన సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. హోంగార్డు ఉద్యోగం కోసం అభ్యర్థులకు పరీక్ష రాసేందుకు ఒడిశా ప్రభుత్వం సంబల్‌పూర్ జిల్లాలోని జమర్‌పాలి రన్‌వేను కేటాయించారు. డెస్కులు, మ్యాట్‌లు వంటి కనీస సౌకర్యాలు లేకుండా 8,000మందికి పైగా అభ్యర్థులు రన్‌వేపై కూర్చుని పరీక్ష రాశారు. అభ్యర్థులను పర్యవేక్షించేందుకు డ్రోన్‌లను వినియోగించడం గమనార్హం. వివరాల ప్రకారం.. సబల్‌పూర్ జిల్లాలోని 24 పోలీస్‌స్టేషన్‌లలో హోంగార్డు పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పోస్టులకు కనీస అర్హత 5వ తరగతి ఉత్తీర్ణత. కేవలం 187 పోస్టుల కోసం జిల్లా వ్యాప్తంగా 8,000మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో ఎంబిఎ, ఎంసిఎ, గ్రాడ్యుయేట్లు, ఇంజనీర్లు, డిప్లమో, ఐటిఐ శిక్షణ పొందిన అభ్యర్థులతో పాటు కంప్యూటర్ సైన్స్‌లో డిగ్రీ పొందిన వారు కూడా ఉన్నారు. అభ్యర్థులను ఉదయం 6.00గంటలకు రిపోర్ట్ చేయాలని అధికారులు ఆదేశించారు. అయితే ఉదయం 9.00 గంటలకు పరీక్షా కేంద్రంలోకి అనుమతించబడ్డారు. ఉదయం 10.30గంటలకు ప్రశ్నాపత్రాలను పంపిణీ చేయబడ్డాయి. 50మార్కుల ప్రశ్నాపత్రంలో 20 మార్కులకు పేరా రైటింగ్, 30 మార్కులకు జనరల్ నాలెడ్జ ప్రశ్నలు ఉన్నాయి. ముగ్గురు అదనపు సూపరింటెండెంట్లు, 24మంది ఇన్స్పెక్టర్లు, 86మంది సబ్‌ఇన్స్పెక్టర్లు, అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్లతో పాటు వందమందికి పైగా హోమ్ గార్డులు, ట్రాఫిక్ సిబ్బందిని అభ్యర్థులను పర్యవేక్షించారు. ఈ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిరుద్యోగ సమస్యకు ఈ ఘటన నిదర్శనమని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఉపాధి కల్పనలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యమైందని మండిపడ్డాయి.

# ఉక్రెయిన్ డ్రోన్ దాడిలో దెబ్బతిన్న రెండు నౌకలు

### రష్యా అధికారుల ధృవీకరణ

**మాస్కో, డిసెంబర్ 22 :** ఉక్రెయిన్ డ్రోన్ దాడిలో రెండు నౌకలు దెబ్బతిన్నట్లు రష్యా అధికారులు సోమవారం తెలిపారు. డ్రోన్ దాడిలో రెండు పిల్లర్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, నౌకల్లో మంటలు చెలరేగాయని అన్నారు. రష్యాలోని క్రాస్నోడార్ ప్రాంతంలోని నల్లసముద్ర తీరంలో ఉన్న వోల్నా గ్రామంపై ఉక్రెయిన్ డ్రోన్‌లతో విరుచుకుపడిందని క్రాస్నోడార్ ప్రాంతానికి చెందిన కార్యనిర్వాహక ప్రధాన కార్యాలయం టెలిగ్రామ్‌యాప్‌లో పేర్కొంది. నల్లసముద్రంలోని వోల్నా టెర్మినల్ వద్ద ఉన్న నౌకల్లోని సిబ్బందిని సురక్షితంగా ఖాళీ చేయించామని తెలిపింది. డ్రోన్ దాడితో 1,500 చదరపు మీటర్ల వరకు మంటలు వ్యాపించాయని, స్థానిక కాలమానం 2.00 గంటలకు కూడా మంటలు అదుపులోకి రాలేదని అధికారులు తెలిపారు. ఉక్రెయిన్ తరచుగా క్రాస్నోడార్ ప్రాంతంపై విరుచుకుపడుతోందని రష్యా ఆర్మీ తెలిపింది. శుద్ధి కర్మాగారాలు, ఇంధన గిడ్డంగులు, ఓడరేవులు మరియు వైమానిక స్థావరాలను లక్ష్యంగా డ్రోన్లతో దాడి చేస్తోందని పేర్కొంది.నల్లసముద్ర ప్రాంతం రష్యా ఇంధన ఎగుమతులు మరియు సైనిక వ్యూహాలకు ముఖ్యమైన కేంద్రంగా ఉంది. క్రిమియా సరిహద్దులో, దక్షిణ ఉక్రెయిన్‌లోని డ్రోన్ పరిధిలో ఉంది. నల్లసముద్ర ప్రాంతంలోని వోల్నా గ్రామం రష్యాకు కీలకం. ఇది 2014లో ఉక్రెయిన్ నుండి విలీనం చేయబడిన క్రిమియన్ ద్వీపకల్పానికి ప్రధాన భూభాగాన్ని అనుసంధానిస్తుం డటంతో పాటు కెర్చ్ జలసంధిపై ఉన్న క్రిమియన్ వంతెనకు దగ్గరగా కూడా ఉంటుంది.



# తెలంగాణ పంచాయతీలు దేశానికి ఆదర్శం

### మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి వ్యాఖ్య

**సూర్యాపేట, డిసెంబర్ 25 :** తెలంగాణ గ్రామపంచాయతీలు యావత్ దేశానికే ఆదర్శమని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తెలిపారు. ఆ ఘనత ముమ్మాటికీ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దే అని అన్నారు. గత ఉమ్మడి పాలనలో ఏమాత్రం అభివృద్ధికి నోచుకోని గ్రామాలు.. పోరాడి సాధించుకున్న తెలంగాణలో అన్ని గ్రామాల రూపురేఖలు మార్చుకున్నామని గుర్తుచేశారు. సూర్యాపేట నియోజకవర్గంలోని ఆత్మకూర్ (ఎస్) మండలం నెమ్మికల్ గ్రామ సర్పంచ్ ప్రమాణస్వీకారం వేడుకకు జగదీశ్‌రెడ్డి హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం నూతన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లను సత్కరించారు. ఈ సందర్భంగా జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో పదేండ్లు ఎనలేని అభివృద్ధి సాధించుకున్నామని తెలిపారు. దేశంలోనే అభివృద్ధి చెందిన గ్రామాల్లో మొదటి పది తెలంగాణ గ్రామాలే ఉన్నాయని.. మొదటి 20 గ్రామాల వారీగా చూసిన 19 స్థానాలను తెలంగాణ గ్రామాలే కైవసం చేసుకున్నాయని పేర్కొన్నారు. అంతటి ఘన చరిత్ర కేసీఆర్ పాలనకే సాధ్యమైందని పేర్కొన్నారు. పల్లె ప్రకృతి వనాలతో పచ్చదనం పెంచుకున్నామని.. వాటి సంరక్షణకై ప్రతి గ్రామంలో వాటర్ ట్యాంకర్ ఏర్పాటు చేసుకున్నామని జగదీశ్ రెడ్డి తెలిపారు. అంతా ఐక్యతతో కలిసి గ్రామాలను మరింత అభివృద్ధి పథంలో నడపాలని పిలుపునిచ్చారు



## చర్లపల్లి ఉపసర్పంచిగా ప్రమాణ స్వీకారం చేసిన ఎమ్ఎస్ రెడ్డి

**పరకాల, నేడు న్యూస్ :** నడికూడ మండలం చర్లపల్లి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ వార్డు సభ్యులు ఏకగ్రీవంగా రెండవ వార్డు సభ్యుడు మామిడాల శ్రీనివాసరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకోగా. సోమవారం రోజు ఉప సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,తనపై నమ్మకం ఉంచి ఉప సర్పంచిగా బాధ్యతలు అప్పగించిన బిఆర్ఎస్ పార్టీ నాయకులకు,గ్రామ ప్రజలకు, వార్డుసభ్యులకు ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధి తన ప్రధాన లక్ష్యమని గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి పారిశుద్ధ్యం,తాగునీటి సమస్యల పరిష్కారం పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్ బండి రేణుక శంకర్ తో సమన్వయంగా పనిచేస్తూ ప్రతి వార్డు సమస్యను పరిష్కరించేందుకు చిత్త చూద్దితో పని చేస్తానని తెలిపారు. గ్రామం లో బాధాకరంగా మారిన కోతుల బెడదను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్ది ప్రజలందరి సహకారంతో ముందుకు సాగుతానని హామీ ఇచ్చారు.

## ఆల్ ఇండియా దళిత్ యాక్షన్ కమిటీ

### హనుమకొండ జిల్లా అధ్యక్షులుగా తంగెళ్ళ నవీన్ రెడ్డి



**పరకాల, నేడు న్యూస్ :** హనుమకొండ జిల్లాలోని నడికుడ మండలం, నర్సక్కపల్లె గ్రామానికి చెందిన తంగేళ్ళు నవీన్ రెడ్డి ని అల్ ఇండియా దళిత యాక్షన్ కమిటీ హనుమకొండ జిల్లా అధ్యక్షులుగా నియ మించినట్లు తెలంగాణ రాష్ట్ర ఐడాక్ అధ్యక్షులు రత్నం శైలేందర్ తెలిపారు. తంగెళ్ళ. నవీన్ రెడ్డి గత కొంతకాలం నుండి అన్ని కులాల వర్గాల పేదలకు సమన్యాయం జరుగాలని పేదలను సామాజికంగా చైతన్యం చేస్తు, పేదవర్గాల అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం కనుక వారి ఆర్థిక ఎదుగుజల కోసం పని చేస్తున్నందున ఆయనను జిల్లా అధ్యక్షులుగా నియమించడం జరిగిందని రాష్ట్ర అధ్యక్షులు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడైన తంగెళ్ళు నవీన్ రెడ్డి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు పేదవాడు మరింత పేదవాడుగా ధనమంతుడు మరింత ధనవంతులు అవుతూాండు తప్ప పేదరికం అలాగే ఉంటుంది అభివృద్ధి అంటే రంగులగోడలు, అందాల మేడలు కాదు. పేదవాడి ఆర్థికాభివృద్ధే దేశాభివృద్ధి అన్న బారతరత్న రా జ్యాంగ నిర్మాత డా.బిఆర్.అంబేద్కర్ చెప్పినమాట అక్షర సత్యం. కుల, మత, వర్గ, లింగ బేధం లేకుండా ప్రతిపౌరుడు అర్థంగా ఎదగాలని ఎస్సీ ఎస్టి బిసి మైనారిటీ ఓసికు విద్య, ఉద్యోగ రాజికీయ రంగాలలో రిజర్వేషన్లు ఏర్పాటు చేసి, అన్ని కులాల వాళ్ళక సమన్యాయం చేయాలని తంగెళ్ళ. నవీన్ రెడ్డి అన్నారు. నన్ను గుర్తించి నాకు జిల్లా అధ్యక్షులుగా నియమించిన రాష్ట్ర అభ్యక్షలు రత్నం. శైలిందర్ కి, జాతియ అద్యక్షులు డా.చినా రాము కి కృతమంబాలు తెలియజేశారు.

## బీసీలకు ఉచిత కోచింగ్ గడువు పొడిగింపు

**మేడ్చల్ నేడు బ్యూరో :** ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టెస్టింగ్ సర్వీస్ కు సంబంధించి బీసీ స్టడీ సర్కిళ్లలో నిర్వహించబడుతున్న ఉచిత కోచింగ్ దరఖాస్తు గడువును అభ్యర్థుల సౌలభ్యార్థం వచ్చే నెల 11వరకు పొడిగించినట్టు మేడ్చల్ జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఝాన్సీ రాణి తెలిపారు. సోమవారం ఆమె ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేస్తూ, ఈ ఉచిత కోచింగ్ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బీసీ స్టడీ సర్కిళ్లలో నిర్వహించబడుతుందన్నారు. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాకు చెందిన అర్హత గల బి.సి. విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, నిర్ణీత గడువులోపు తమ దరఖాస్తులను సమర్పించి, ఐ.ఈ.ఎల్ .టి.ఎస్ ఉచిత కోచింగ్ పొందవలసిందిగా ఆమె సూచించారు. ఈ కోచింగ్ ద్వారా విదేశీ విద్యా అవకాశాలకు అవ ఎల్.టి.ఎస్ పరీక్షలో మెరుగైన ప్రతిభకనబరచేందుకు విద్యార్థులకు అవకాశం కలుగుతుందనీ ఝాన్సీ రాణి వెల్లడించారు.



## నూతన సర్పంచ్ కు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకుడు యండి. దావూద్

**కామారెడ్డి జిల్లా, డిసెంబర్ 22 నేడు న్యూస్ బ్యూరో :** నిజాంసాగర్ మండల కేంద్రంలోని బంజపల్లి గ్రామ పంచాయతీ కాంగ్రెస్ పార్టీ నూతన సర్పంచ్ గా కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ అమ్మగారైన ఏలే సుగుణమ్మ ఈరోజు అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా నూతన సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం చేసిన సుగుణమ్మ కు ఉప సర్పంచ్ అనీస్ పటేల్ కు మరియు వార్డు సభ్యులకు బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ నాయకులు యండి. దావూద్ హార్ధిక శుభాకాంక్షలు తెలిపారు.



## విద్యార్థుల చదువే మా లక్ష్యం

- ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్
- రోటరీ క్లబ్ వరంగల్ ద్వారా సైకిళ్ల పంపిణీ

**పాలకుర్తి, నేడు న్యూస్:** జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మల్లంపల్లిలో దూర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థినిల విద్యాభివృద్ధి కొరకు ఆ పాఠశాలలో పనిచేసే ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో బాలికలకు రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ తరఫున 6,000 రూపాయల విలువగల 11 సైకిళ్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపా ధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థినిలు దూర ప్రాంతం నుండి సమయానికి స్కూలుకు వచ్చి వారి విద్యని అభివృద్ధి చేసుకోవడం కొరకే ఈ సహాయం చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రొటీరియన్స్ శివప్రసాద్, ఎల్లరాజు ,సుధాకర్ ,రమేష్ ,శ్రీకాంత్, మదన్ తో పాటు గ్రామ సర్పంచ్ పోశాల వెంకన్న పాల్గొన్నారు.

# ప్రారంభానికి ముస్తాబవుతున్న కోర్టు కాంప్లెక్స్!

- ఈనెల 30న మేడిపల్లిలోని ఉప్పల్ కోర్టు కాంప్లెక్స్ ప్రారంభోత్సవం
- కోర్టు కాంప్లెక్స్ పనులను పరిశీలించిన జిల్లా జడ్జి శ్రీదేవి
- కోర్టు కాంప్లెక్స్ ఆవరణ శుభ్రత పై వివరించిన డిప్యూటీ కమిషనర్ త్రిలేశ్వర్ రావు




**పీర్జాదిగూడ, నేడు న్యూస్:** మేడిపల్లిలో నూతనంగా ఏర్పాటు కానున్న ఉప్పల్ కోర్టు కాంప్లెక్స్ ప్రారంభోత్సవానికి ముస్తాబవుతోంది. పీర్జాదిగూడ సర్కిల్ పరిధిలోని మేడిపల్లిలో ఉప్పల్ కోర్ట్ కాంప్లెక్స్ ఏర్పాటు అవుతోంది. మేడిపల్లి లో ఏర్పాటు కానున్న కోర్టు కాంప్లెక్స్ లో మూడు కోర్టులు ఏర్పాటు చేస్తున్నారు. రెండు కోర్టులకు మాత్రమే భవనాలు అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో అదనంగా మరో భవనాన్ని స్థానిక అడ్వకేట్ల సహకారంతో నిర్మించారు. అదనపు భవనం నిర్మాణ పనులు పూర్తికావడంతో కోర్టును ప్రారంభించేందుకు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగానే ఈనెల 30న కోర్టు కాంప్లెక్స్ ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. ఈ సందర్భంగా కోర్టు భవనానికి రంగులు అద్దడంతో పాటు, అదనపు భవనం నిర్మాణం కూడా చక చకా పూర్తవుతోంది. కాగా, ఉప్పల్ కోర్టు కాంప్లెక్స్ ప్రారంభోత్సవ పనులను జిల్లా జడ్జి శ్రీదేవి సోమవారం పరిశీలించారు. స్థానిక మున్సిపల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ త్రిలేశ్వర్ రావు, మేడిపల్లి ఎస్సై కృష్ణయ్య లతో కలిసి కోర్టు కాంప్లెక్స్ లో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం కోర్టు కాంప్లెక్స్ లో మౌలిక వసతుల వివరాలను డిప్యూటీ కమిషనర్ త్రిలేశ్వర్ రావును జిల్లా జడ్జి శ్రీదేవి అడిగి తెలుసుకున్నారు.



### మరో మూడు కోర్టులకు అనుమతి.?

ఇప్పటికే మేడిపల్లిలో మూడు కోర్టులను ప్రారంభించనుండగా, అదనంగా మరో మూడు కోర్టులు మంజూరు చేస్తూ అనుమతి ఇచ్చినట్లుగా తెలుస్తోంది. కానీ, మరో మూడు కోర్టులకు భవనాలు మాత్రం మేడిపల్లిలో అందుబాటులో లేవు. కోర్టులు ఏర్పాటు చేయాలనుకుంటే నూతనంగా మరో మూడు భవనాలు నిర్మించాల్సి ఉంటుంది. దీనిపై జిల్లా కోర్టు అధికారులు దృష్టి సారించినట్లుగా సమాచారం. బోడుప్పల్ లో నూతనంగా పోలీస్ స్టేషన్, రామంతపూర్ లో మరో పోలీస్ స్టేషన్ ఏర్పాటు కానుండడంతో అందుకు తగ్గట్టుగా కోర్టులు ఏర్పాటు కానున్నాయి. మేడిపల్లిలో ఆరు కోర్టులు వస్తే స్థానికంగా ట్రాఫిక్ సమస్యతో పాటు మౌలిక వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంటుంది.

## గ్రామపంచాయతీలో కొలువుదీరిన నూతన పాలకవర్గం

### ప్రమాణస్వీకారం చేసిన నూతన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు



**మొయినాబాద్, నేడు న్యూస్ :** గ్రామాలలో నూతన పాలకవర్గం కొలువుదీరాయి. గ్రామాల్లో ప్రమాణస్వీకారం సందడి నెలకొంది. నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు గ్రామపంచాయతీ పదవి బాధ్యతలను స్వీకరించారు. సోమవారం ప్రమాణస్వీకారం కార్యక్రమానికి సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేశారు. మొయినాబాద్ మండల పరిధిలోని మొత్తం 19 గ్రామపంచాయతీలు 166 వార్డులు ఉండగా.. అందులో 9మంది వార్డు సభ్యులు ఏకగ్రీవం కాగా 19 సర్పంచ్, 157 వార్డులకు ఎన్నికలు జరిగాయి. మొత్తంగా 19 మంది సర్పంచ్ లు 166 మంది వార్డు సభ్యులుగా గెలిచారు. అనంతరం ఉప సర్పంచ్ లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు సోమవారం ఆయా గ్రామపంచాయతీలలో ప్రమాణ స్వీకారం చేశారు. కొన్ని గ్రామాల్లో ప్రజా ప్రతినిధుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. అమ్డాపూర్ గ్రామ సర్పంచ్ గా మద్యపాగ కృష్ణ 10:30 గంటలకు న్యాయవాది కడుమూరి ఆనంద్ సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. శ్రీరాంనగర్ గ్రామంలో స్థానిక చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సమక్షంలో ఏర్పుల గీతా మహిపాల్, రెడ్డిపల్లి, బాకారం గ్రామలలో సైతం ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి చేతుల మీదగా సర్పంచ్ గా వెంకటేష్ గౌడ్, షాపురం రాజు, ఎత్బర్ పల్లి గ్రామంలో చింతకింది ప్రవీణ్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య సమక్షంలో మేడిపల్లి గ్రామంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే బిజెపి ఇన్చార్జి కెఎస్.రత్నం చేతుల మీదగా మల్కాపురం శ్రీనివాస్‌లు ప్రమాణస్వీకారం చేసి తమ బాధ్యతలను స్వీకరించారు. ఈ కార్యక్రమలలో ఆయా మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## 'మన కుటుంబం' కుటుంబ సమ్మేళనం!

- కృతజ్ఞత, గౌరవం, అనుబంధానికి హృదయస్పర్శతో కూడిన వేడుక
- రక్త సంబంధాల విలువను, తరతరాల అనుబంధాన్ని చాటిన "మన కుటుంబం'

**అనంతపురం, నేడు ప్రతినిధి:** రక్త సంబంధాల విలువను, తరతరాల అనుబంధ బలాన్ని మరోసారి చాటిచెప్పిన కార్యక్రమం "మన కుటుంబం" కుటుంబ సమ్మేళనం. దాదాపు ఐదు తరాల కుటుంబ సభ్యులు ఒకే వేదికపై కలుసుకుని ప్రేమ, గౌరవం, ఐక్యతతో బంధాలను మరింత బలపరుచుకున్న ఈ భావోద్వేగ వేడుకలు 2025 డిసెంబర్ 20, 21 తేదీలలో అనంతపురంలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ గెస్ట్ హౌస్ లో ఘనంగా జరుపుకున్నారు. చాలా కాలం తర్వాత కుటుంబ సభ్యులందరూ ఒకే చోట చేరడంతో వేదిక అంతా ఆనందం, ఆప్యాయత, జ్ఞాపకాలతో నిండిపోయింది. పెద్దల ఆశీర్వాదాలు, పిల్లల నవ్వులు, సోదర సోదరీమణుల మధ్య అనుబంధం ఈ సమ్మేళనాన్ని ఒక చిరస్మరణీయ అనుభూతిగా మార్చాయి. ఈ కుటుంబ సమ్మేళనానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది తల్లిదండ్రుల సత్కారం. తమ పిల్లలను మంచి విలువలతో పెంచి, కుటుంబానికి బలమైన పునాది వేసిన అన్ని తల్లిదండ్రులను వారి కుమారులు, కుమార్తెలు కృతజ్ఞతాభా వంతో సత్కరించారు, అలాగే తమ జీవితాలకు మార్గదర్శకు లుగా నిలిచినందుకు కృతజ్ఞతాభివందనం చేశారు. ఈ సం దర్భంగా పలువురి కళ్లలో ఆనందభాష్పాలు మెరిసి, వేదికంతా భావోద్వేగంతో నిండిపోయింది. "మా జీవితాలకు మీ ఆశీర్వా దమే మా బలం" అన్న మాటలు ప్రతి కుటుంబ సభ్యుని హృదయాన్ని తాకాయి. అలాగే, ఈ మహత్తర కార్యక్రమాన్ని ఆలోచించి, ప్రణాళికాబద్ధంగా నిర్వహించి, అన్ని కుటుంబ సభ్యులను ఒకే గూటి కింద కలిపిన నిర్వాహకులను కూడా ప్రత్యేకంగా సత్కరించారు. కుటుంబ ఐక్యతకు ప్రతీకగా నిలి చిన ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేసినందుకు డాక్టర్ తలారి నరేష్ కుమార్, తలారి అంజయ్య, తలారి మురళి, తలారి జనార్ధన్, పిట్ట పవన్ కుమార్, చరణ్ కుమార్, హరిష్ కుమార్, శ్రీమతి మాధవి, తలారి విష్ణు వర్ధన్, సాయి కృష్ణ, దిలీప్ కుమార్, తలారి దీప్తి, నాగేంద్ర లకు కుటుంబ పెద్దలు, సభ్యులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. సమూహ ఫోటోలు, కలిసి భోజనం, ఆత్మీయ సంభాషణలు, భావోద్వేగ వీడ్కోలు మధ్య ఈ కుటుంబ సమ్మేళనం ముగిసిం ది. వచ్చే తరాలకు కుటుంబ విలువలు, ఐక్యత, పరస్పర గౌరవం ఎంత ముఖ్యమో గుర్తుచేసిన ఈ "మన కుటుంబం" కుటుంబ సమ్మేళనం– తరతరాల అనుబంధానికి చిరస్మరణీయ మైలురాయిగా నిలిచింది. ఈ కుటుంబ కలయికలో సాంస్కృ తిక కార్యక్రమాలు, వినోదాత్మక ఆటలు, పోటీలు అందరినీ ఉత్సాహపరిచాయి. నిర్వహించిన పోటీల్లో విజేతలు ఇలా ఉన్నారు:

పిల్లల చిత్రలేఖన పోటీ: ప్రాచిసహస్ర– మొదటి బహుమతి

**ట్రెజర్ హంట్:** పిట్ట పవన్ కుమార్ వారి బృందం

పిల్లల ఉత్తమ నృత్య ప్రదర్శన: హిమానిక, మాహి మాన్విత్

**కరాటే పోటీ:** సహిష్ణు శరవణ్

**మ్యూజికల్ చైర్స్ (పిల్లలు):** హిమానిక

**మ్యూజికల్ చైర్స్ (పెద్దలు):** శాంతి

సమూహ ఫోటోలు, కలిసి భోజనం, హృదయపూర్వక సంభాషణలతో ఈ కుటుంబ సమ్మేళనం ముగిసింది. కుటుంబ విలువలు, పరస్పర గౌరవం, ఐక్యత ఎంత ముఖ్యమో తదుపరి తరాలకు చాటిచెప్పిన ఈ "మన కుటుంబం" సమ్మేళనం–అనుబంధాలకు అద్దం పట్టిన ఒక గొప్ప ఉదాహరణగా నిలిచింది.

## ఆదరించిన ప్రజలకు అండగా ఉంటా..

### బాకారం 1వ వార్డు సభ్యుడు కొంతం నాగేశ్వర్ రెడ్డి



**మొయినాబాద్, నేడు న్యూస్ :** ఆదరించిన ప్రజలకు అండగా ఉంటానని నాపై నమ్మకంతో 1వ వార్డు సభ్యునిగా గెలిపించిన గ్రామ ప్రజలకు అండగా ఉంటానని కొంతం నాగేశ్వర్ రెడ్డి అన్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని బాకారం గ్రామపంచాయతీ ఎన్నికల్లో 1వ వార్డు సభ్యునిగా గెలిచిన కొంతం నాగేశ్వర్ రెడ్డి సోమవారం ప్రమాణస్వీకారం చేసి తన బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల కష్టసుఖాలు అర్థం చేసుకొని వారికి అన్ని పరిస్థితుల్లో అండగా నిలుస్తానని అన్నారు. నన్ను గెలిపించిన ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ.. ప్రజల కష్టాలు తీర్చడం వారి అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ.. వారికి ఎలాంటి ఆపద వచ్చిన ముందుండి సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు.




## కలెక్టరేట్‌లో బ్రెస్ట్ ఫీడింగ్ క్యాబిన్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి జిల్లా డిసెంబర్ 22 నేడు న్యూస్ బ్యూరో :** జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా మహిళ సాధికారత కేంద్రం వారు తల్లులు పిల్లలకు పాలు ఇచ్చుటకై తయారు చేసిన బ్రెస్ట్ ఫీడింగ్ క్యాబిన్ ను కలెక్టరేట్ ఐ డి ఓ సిలో సోమవారం కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ రిబ్బన్ కట్ చేసి క్యాబిన్ ను ప్రారంభించారు. ఇలాంటి క్యాబిలను ప్రతి బస్టాప్ లలో ట్రెస్ట్ ఫీడింగ్ క్యాబినస్ ఏర్పాటు చేయాలని, ఈ క్యాబిన్లు పిల్ల తల్లులకు చాలా ఉపయోగ పడుతుందని తెలిపారు . అలాగే చంటి బిడ్డ తల్లులకు రద్దీ ప్రాంతాలలో చాలా ఇబ్బందికరంగా ఉంటుందని ఇలాంటి బెస్ట్ ఫీడింగ్ క్యాబిన్స్ పెట్టడం వల్ల ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, అదనపు డిఆర్డి డి ఎ సూపర్వైజర్, జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయ సిబ్బంది సఖి కేంద్రం సిబ్బంది ఐ సి డి ఎస్ సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు.



## కోనాపూర్ సర్పంచిగా కిష్టవ ప్రమాణ స్వీకారం

**కామారెడ్డి జిల్లా, డిసెంబర్ 22 నేడు న్యూస్ బ్యూరో :** బాన్సువాడ మండలం కోనాపూర్ గ్రామ సర్పంచిగా ఎ ల్లగోని కిష్టవ్వ, ఉప సర్పంచ్ బంజ భూషణం సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. గ్రామ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రధాన ఉపాధ్యాయులు శేఖర్ వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. వార్డు సభ్యులతో కూడా దైవ సాక్షిగా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వారికి బాధ్యతల ధ్రువీకరణ పత్రాలను గ్రామ కార్యదర్శి భరత్ చేతుల మీదుగా అందజేశారు. ప్రమాణ స్వీకారం మహోత్సవానికి గ్రామం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చారు. మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజల సమక్షంలో కనుల పండుగ గా నిర్వహించారు.

# ముగిసిన రాష్ట్రపతి శీతాకాల విడిది





- తిరిగి ఢిల్లీకి పయనమైన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- వీడ్కోలు పలికిన రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, సీ.ఎం, మంత్రులు

**మేడ్చల్, నేడు బ్యూరో :** ఈ నెల 17న శీతాకాల విడిదికి హైదరాబాద్ కు విచ్చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన ముగిసింది. ఐదు రోజులు వివిధ కార్యక్రమాలలో పాల్గొన్న రాష్ట్రపతి సోమవారం తిరిగి ఢిల్లీకి బయలుదేరారు. ఈ సందర్భంగా రాష్ట్రపతికి హకీమ్ పేట విమానాశ్రయంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, పంచాయతీ రాజ్, మహిళాభివృద్ధి శాఖ మంత్రివర్యులు సీతక్క, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, మహేష్ భగవత్, మేడ్చల్ – మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరిలు వీడ్కోలు పలికారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ప్రత్యేక విమానంలో రాష్ట్రపతి ఢిల్లీకి బయలుదేరారు

## దేవనాథ జీయర్ స్వామి ప్రజ్ఞా వికాసం



**పాలకుర్తి,నేడు న్యూస్:** పాలకుర్తి వికాసం వారి ఆధ్వర్యంలో ప్రగతి విద్యా నిలయం వేదికగా సోమవారం రోజు.అన్ని పాఠశాలల పదవ తరగతి విద్యార్థినీ – విద్యార్థులు మరియు దిగువ తరగతి విద్యార్థులందరికీ కూడా జ్ఞానహిత బోధ, చెప్తూ చదువుతూపాటు విద్యార్థులకు సమాజంలో ఏ విధంగా నడుచుకోవాలి.సాంకేతిక రంగాన్ని ఎలా మలుచుకుంటే మనకు ఉపయోగపడుతుంది. విద్యతోపాటు విద్యార్థి యొక్క క్రమశిక్షణ పెద్దలపట్ల గౌరవం ఎలా ఉండాలని వారు బోధించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రగతి విద్యా నిలయం కరస్పాండెంట్ వీరమనేని వెంకటేశ్వర్లు , దయాకర్ రెడ్డి, నరసింహారెడ్డి, తిరుమల , రామకృష్ణ చారి , పాలకుర్తి వికాసం వారు ఇమ్మడి దామోదర్ తాళ్ల పెల్లి వెంకట నారాయణ. పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.



## టీఎన్జీవోఎస్ ఈసీ మెంబర్‌గా శీలం శ్యామల

### ఉద్యోగుల ఘన సన్మానం

**కారేపల్లి, నేడు న్యూస్ :** టీఎన్జీవోఎస్ మెడికల్ ఫోరం ఈసీ మెంబర్‌గా కారేపల్లి మండల పరిధిలోని గాంధీనగర్ సబ్ సెంటర్‌లో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న శీలం శ్యామల ఎన్నికయ్యారు. ఖమ్మం నగరంలోని టీఎన్జీవోఎస్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ ఎన్నికల్లో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో ఈసీ మెంబర్‌గా శ్యామల ఎన్నిక కావడం కారేపల్లి మండలానికి గర్వకారణమని ఉద్యోగులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ హెల్త్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈసీ మెంబర్‌గా ఎన్నికైన శ్యామలను వైద్యాధికారి ప్రబంధ, సూపర్వైజర్ సూర్యం, తోటి ఉద్యోగులు శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.



## భాగ్యనగర్ తండాలో సర్పంచ్, వార్డు మెంబర్ల ప్రమాణస్వీకార మహోత్సవం

**కారేపల్లి, నేడు న్యూస్:** సింగరేణి మండలంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్ల ప్రమాణస్వీకార మహోత్సవాలు ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాలను పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించారు. భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీ పెంద్ర అనిల్ చేత నూతన సర్పంచ్‌గా బానోత్ హీరాలాల్ ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.

### పోలంపల్లి సర్పంచ్‌గా హేమలత బాలాజీ ప్రమాణస్వీకారం



**కారేపల్లి, నేడు న్యూస్:** సింగరేణి మండలం పోలంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్, వార్డు మెంబర్ల ప్రమాణస్వీకార మహోత్సవం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో హాజరై వేడుకను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నూతన సర్పంచ్‌గా హేమలత బాలాజీ ప్రమాణస్వీకారం చేశారు. ప్రత్యేక అధికారి దుగ్గిరాల జయరాజు, పంచాయతీ కార్యదర్శి రవికుమార్ ఆధ్వర్యంలో అధికారికంగా కార్యక్రమం నిర్వహించబడింది. కార్యక్రమంలో వార్డు మెంబర్లు లాడియా రమేష్, కవిత, సుజాత, శివరాం, సంజీవ్, రోజారాణి, విజయలక్ష్మి, లావణ్య పాల్గొన్నారు. అలాగే మాజీ సర్పంచ్ భద్రు నాయక్, జగ్గయ్య నాయక్, బద్యా నాయక్, ధోని, కూన, బద్రు నాయక్, రాందాస్, దేవుల, కిషోర్, లక్ష్మణ్, సీతారాం, లక్పతి, జర్పా మంగ్యా, మునిరామ్, వర్ష మోహన్, విజయ్ కుమార్, ఈసం సునీత తదితర గ్రామ పెద్దలు హాజరయ్యారు.



## గుట్టకిందగుంపు సర్పంచ్‌గా ఉండం రాఘవులు ప్రమాణస్వీకారం

**కారేపల్లి, నేడు న్యూస్:** సింగరేణి మండలం పరిధిలోని ఉండం రాఘవులు గుట్ట కింద గుంపు గ్రామపంచాయతీలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌తో పాటు వివిధ వార్డు నెంబర్లకు చెందిన వార్డు సభ్యులు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఘనంగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమాన్ని పంచాయతీ అధికారులు అధికారికంగా, క్రమబద్ధంగా నిర్వహించారు.

## తెలుగు రాష్ట్రాల మధ్య చిచ్చు పెడుతున్న కేసీఆర్

### టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు వెంకన్న



**పాలకుర్తి నేడు న్యూస్:** తెలంగాణ వచ్చి 13 సంవత్సరాల అవుతున్న రాష్ట్రాల మధ్య ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయం చేస్తున్న కేసీఆర్ కి పంచాయతీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టిన బుద్ధి లేకుండా ఎంపీటీసీ జడ్పీటిసి మరియు మున్సిపాలిటీ ఎన్నికల కోసం చిల్లర రాజకీయాలు చేస్తున్నారు టిఆర్ఎస్ ప్రభుత్వంలో రియల్ ఎస్టేట్ దందాలకు తెరలేపింది నీ కొడుకు కేటీఆర్ కాదా మై హోమ్ రామేశ్వరరావు కు హైదరాబాదులో కారు చౌకగా ప్రభుత్వ భూములు ఇచ్చి రామేశ్వరరావు తో నీ అల్లుడు హరీష్ రావు అంట కాగింది నిజం కాదా నీ ప్రభుత్వ పదేళ్ల హయాంలో ఫోన్ టాపింగ్ చేయించింది నిజం కాదా ఈ కార్ రేసులో నీ కొడుకు కేటీఆర్ ప్రమేయం ఉన్నది నిజం కాదా తెలంగాణ కోసం నీ జీవితం అంకితం అంటున్న నువ్వు తెలంగాణ రాష్ట్ర వ్యతిరేకైనా వైయస్ రాజశేఖర్ రెడ్డి కొడుకు జగన్ రెడ్డితో అంటగాగి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ అనుమతులు ఇచ్చింది నువ్వు కదా తెలంగాణ కి ద్రోహం చేసింది నిజం కాదా రాయలసీమ రత్నాలసీమ చేస్తానని ప్రగల్భాలు పలికి రోజా ఇంటికి వెళ్లి చాపల పులుసు తిన్నది వాస్తవం కాదా కమిషన్ల కోసం కాళేశ్వరం నిర్మాణం చేసి ఈరోజు కాళేశ్వరాన్ని కూలేశ్వరం చేసింది నీ చేతకానితనం కాదా నీ పదేళ్ల పాలనలో ఎన్ని ప్రాజెక్టులు పూర్తి చేశావు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ఎందుకు పూర్తి చేయలేదు ఎస్ ఎల్ బి సి పనులు ఎందుకు పూర్తి కాలేదు నువ్వు దత్తత తీసుకున్న వాసాల మరి గ్రామ నిర్వాసితులకు ఎందుకు న్యాయం చేయలేదు పేదవాళ్ల ఇల్లు కూల్చి నీ ఫామ్ హౌస్ కి రోడ్డు వేసుకోవడం తప్ప నువ్వు తెలంగాణ కి నువ్వు చేసింది ఏంటి అధికారం పోయిన తర్వాత వైజాగ్ లో స్టార్ హోటల్ వంట మనుషులతో ఎంవోయూలు చంద్రబాబు చేయించాడని అవాక్కులు చవాకులు చేస్తే నీ మానసిక పరిస్థితి ఏంటో ప్రజల గమనిస్తున్నారు మీ సహచరుడు జగన్మోహన్ రెడ్డి హయంలో జరిగిన సంఘటనను చంద్రబాబుకు అంటగాట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నా నీ కుటిల బుద్ధిని తెలంగాణ ప్రజలు గమనిస్తూనే ఉన్నారు అందుకే అనుకుంటా ప్రధానమంత్రిని కేటీఆర్ కలిసినప్పుడు కెసిఆర్ ఆరోగ్యం జాగ్రత్త అని చెప్పారంటే నీ మానసిక పరిస్థితి ఏంటో అర్థం అవుతుంది కేసీఆర్ ఇంకోసారి చంద్రబాబు నాయుడు జోలికి కానీ వస్తే తెలంగాణ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నిన్ను ని పార్టీని బొంద పెడుతారు అని హెచ్చరిస్తున్నాం ఈ కార్యక్రమంలో టీటీడీపి వరంగల్ పార్లమెంట్ హడాక్ కమిటీ మెంబర్ పసులాది ఉపేందర్ ఎస్.సి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గణపురం ఎల్లయ్య టీడీపీ మండల ఉపాధ్యక్షులు గుగులోత్ రమేష్ టీడీపీ సీనియర్ నాయకులు రాంరెడ్డి పార్టీ ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు

## అగ్ని ప్రమాదాల నివారణపై చర్లపల్లి స్మార్ట్ టెర్మినల్‌లో మాక్ డ్రిల్



**మేడ్చల్, నేడు బ్యూరో:** జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ మార్గనిర్దేశకత్వంలో, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో పరిశ్రమల ప్రమాదాల నివారణపై ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ చెర్లపల్లి స్మార్ట్ టెర్మినల్ (హైదరాబాద్ టెర్మినల్) సర్వే నెంబర్ 183, ఫేజ్, మహాలక్ష్మి నగర్, చెర్లపల్లి, ప్రభుత్వం సికింద్రాబాద్ లో సోమవారం సాయంత్రం పరిశ్రమలలో జరిగే అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించింది. ఒక ట్యాంక్ నుండి మరొక ట్యాంకు కు ఆయిల్ పంపింగ్ చేసేటప్పుడు, ఆయిల్ ఓవర్ ఫ్లో అయినప్పుడు, జరిగే ఫైర్ యాక్సిడెంట్ పై మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగింది. ఈ విషయంలో తీసుకోవాల్సిన అత్యవసర నివారణ చర్యలు, జాగ్రత్తలపై వివిధ శాఖలు సమన్వయంతో ప్రమాద తీవ్రతను తగ్గించేందుకు చేపట్టవలసిన అన్ని చర్యలను మాక్ డ్రిల్ లో నిర్వహించడం జరిగింది. ఈ మాక్ డ్రిల్ మేడ్చల్ – మల్కాజ్గిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ మాక్ డ్రిల్ లో ఎం.డి.ఆర్.ఎఫ్, ఆర్.డి.ఎఫ్, మెడికల్,ఫైర్, ఇండస్ట్రియల్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు,పోలీస్, ట్రాఫిక్, సివిల్ సప్లై, పశుసంవర్ధక శాఖ, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, జీ.హెచ్.ఎం.సి, లాజిస్టిక్ శాఖల వారు ప్రమాద నివారణ చర్యలు చేపట్టారు. సమాచార శాఖ మీడియా పాయింట్ ఏర్పాటు చేసి వాస్తవ వార్తలను, ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగస్వాములైనారు.

## మారణహోమం ఆపడానికే దేశం వీడా.. భయపడి కాదు : షేక్ హసీనా



**న్యూఢిల్లీ :** బంగ్లాదేశ్‌లో కొనసాగుతోన్న ఉద్రిక్తతలపై ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా స్పందించారు. గతేడాది దేశంలో జరిగిన మారణహోమాన్ని ఆపడానికే తాను దేశం వీడి భారత్‌కు వచ్చానని.. భయపడి కాదని అన్నారు. అయినప్పటికీ ఆ దేశంలో ఉద్రిక్తతలు చల్లారట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. యూనస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బంగ్లాలో హింస పెరిగిపోయిందని.. ప్రభుత్వం బలహీనంగా మారిపోయిందని విమర్శించారు. అక్కడ చట్టాలు ఏవీ అమల్లో లేవని.. దేశంలో పాలన సరిగ్గా లేకపోతే అంతర్జాతీయంగా బంగ్లాదేశ్ పేరు దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. అల్లర్లలో 25 ఏళ్ల దీపూ చంద్రదాస్ అనే మైనారిటీ యువకుడిని ఆందోళనకారులు దారుణంగా కొట్టి చంపి, నిప్పంటించడంపై హసీనా ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో మైనారిటీల భద్రతను కాపాడడంలో తాత్కాలిక ప్రభుత్వం విఫలమయ్యిందని ఈ ఘటనతో స్పష్టమయ్యిందన్నారు. యూనస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే భారత్‌కు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటోందని.. కానీ పైకి మాత్రం భారత్‌తో స్నేహం కోరుకుంటున్నట్లు బూటకపు మాటలు చెబుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి ఎన్ని తాత్కాలిక ప్రభుత్వాలు వచ్చినా భారత్–బంగ్లా మధ్య ఉన్న బంధాన్ని బలహీనపరచలేవన్నారు. యూనస్‌కు అండగా ఉన్న తీవ్రవాదులు దేశ ప్రజల మధ్య వైరాన్ని సృష్టిస్తున్నారని.. వారే తన కుటుంబాన్ని, తనను ప్రాణాల కోసం పారిపోయేలా చేశారని హసీనా ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతాయుతమైన ప్రభుత్వం దౌత్య కార్యకలాపాలను రక్షిస్తుందని.. వాటిని దెబ్బతీసే వారిపై చర్యలు తీసుకుంటుందన్నారు. కానీ అందుకు భిన్నంగా యూనస్ ప్రభుత్వం గూండాలకు మద్దతిస్తూ.. వారిని దేశ భక్తులుగా అభివర్ణిస్తోందని మండిపడ్డారు. తమ ప్రభుత్వ పాలనలో తీవ్రవాదులుగా గుర్తించి జైల్లో పెట్టినవారిని యూనస్ ప్రభుత్వం విడుదల చేసి, ప్రజా జీవితంలోకి అనుమతించిందని.. అందువల్లే బంగ్లాలో అల్లర్లు తీవ్రమవుతున్నాయన్నారు.



## బంగ్లాదేశ్ అల్లర్ల వేళ..

### మరో విద్యార్థి నాయకుడిపై కాల్పులు

**ఢాకా:** భారత వ్యతిరేకి, ఇంకిలాబ్ మోంచో నేత షరీఫ్ ఉస్మాన్ హాదీ హత్యతో బంగ్లాదేశ్‌లో హింసాత్మక ఆందోళనలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ పరిణామాల వేళ మరో విద్యార్థి నాయకుడిపై హత్యాయత్నం జరగడం కలకలం రేపుతోంది. బంగ్లాదేశ్ నేషనల్ సిటిజన్ పార్టీ సీనియర్ నేత మోతాలెబ్ సికదార్‌పై గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. సోమవారం ఉదయం ఖులానా పట్టణంలోని సికదార్ నివాసం వద్దే ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో సికదార్ తల్లోకి తూటా దూసుకెళ్లడంతో ఎడమవైపు తీవ్ర గాయమైంది. అతడి మద్దతుదారులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది జరిగే ఎన్నికలకు నేషనల్ సిటిజన్ పార్టీ సిద్ధమవుతోన్న వేళ.. ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. ఇదిలాఉండగా.. డిసెంబరు 12న ఉస్మాన్ హాదీ ఎన్నికల ప్రచారంలో ఉన్నప్పుడు దుండగులు అతడిపై దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన హాదీ.. చికిత్స పొందుతూ గత గురువారం ప్రాణాలు కోల్పోయాడు. అతడి మరణంతో బంగ్లాదేశ్‌లో ఆగ్రహ జ్వాలలు రేకెత్తాయి. హాదీ మద్దతుదారులు, విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. భారత్, అవామీలీగ్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పలు మీడియా కార్యాలయాలు, అవామీలీగ్ ఆఫీసులకు నిప్పు పెట్టారు. దీంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి.




## విమానం ఇంజిన్ ఆయిల్ ప్రెజర్ జీరోకు.. గగనతలంలో ఎమర్జెన్సీ

**న్యూఢిల్లీ :** గగనతలంలో ఎయిరిండియా విమానానికి అత్యవసర పరిస్థితి ఎదురైంది. సాంకేతికలోపం కారణంగా ఇంజిన్ ఆయిల్ ప్రెజర్ జీరోకి పడిపోయింది. దిల్లీ నుంచి ముంబయికి బయల్దేరిన విమానం టేకాఫ్ అయిన వెంటనే పైలట్ ఈ లోపాన్ని గుర్తించారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. దిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సోమవారం ఉదయం 3.20 గంటల సమయంలో ఎయిరిండియా బోయింగ్ విమానం టేకాఫ్ అయింది. ఆ వెంటనే కుడివైపు ఇంజిన్ ఆయిల్ ప్రెజర్ అసాధారణంగా తగ్గిపోవడాన్ని పైలట్ గుర్తించారు. తర్వాత అది జీరోకు పడిపోయింది. దాంతో అప్రమత్తమైన పైలట్ విమానాన్ని వెనక్కి మళ్లించారు. టేకాఫ్ అయినచోటే సురక్షితంగా ల్యాండ్ చేశారు. ఈ ఘటనపై ఎయిరిండియా స్పందించింది. భద్రతా ప్రోటోకాల్స్ ఆధారంగా విమాన సిబ్బంది నిర్ణయం తీసుకున్నారని పేర్కొంది. ప్రస్తుతం ఆ విమానంలో సాంకేతికపరమైన తనిఖీలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ ఊహించని పరిస్థితి వల్ల ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నట్లు వెల్లడించింది. ప్రయాణికులు ముంబయి చేరుకోవడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కొన్ని రోజుల క్రితం కూడా ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం తలెత్తిన సంగతి తెలిసిందే. ఏపీలోని గన్నవరం నుంచి విశాఖ బయల్దేరిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ టేకాఫ్ అవుతుండగా ఒక్కసారిగా నిలిచిపోయింది. అప్పుడు విమానంలో మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, మంత్రి అచ్చెన్నాయుడుతో పాటు 163 మంది ప్రయాణికులు ఉన్నారు.



# 24న మైసా ఫస్ట్ గ్లింప్స్ విడుదల




కన్నడ భామ రష్మిక మందన్నా లీడ్ రోల్‌లో నటిస్తున్న ప్రాజెక్ట్ మైసా. పాన్ ఇండియా బ్యాక్ డ్రాప్‌లో వస్తోన్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదల చేసిన రష్మిక మందన్నా ఫస్ట్ లుక్ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతుండగా.. రష్మిక మందన్నా ఇదివరకె న్నడూ కనిపించని నయా అవతార్‌లో కనిపించనున్నట్టు హింట్ ఇచ్చేశారు మేకర్స్. తాజాగా మరో క్రేజీ వార్తను షేర్ చేశారు. మైసా ఫస్ట్ గ్లింప్స్‌ను డిసెంబర్ 24న గ్రాండ్‌గా లాంచ్ చేయనున్నట్టు ప్రకటించారు మేకర్స్. ఈ చిత్రంలో రష్మిక మందన్నా గోండ్ గిరిజన మహిళ గా కనిపించనుందని పోస్టర్లతో తెలుస్తోంది. మైసా సినిమాతో డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నాడు. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ మూవీకి జేక్స్ బిజోయ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ అందిస్తున్నాడు. పుష్ప ఫ్రాంచైజీలో శ్రీవల్లిగా డీగ్లామరస్ రోల్‌లో పాన్ ఇండియా మార్కెట్‌ను షేక్ చేసిన రష్మిక మందన్నా మరి గోండు గిరిజన మహిళగా ఎలా మెప్పించబోతు న్నదన్నది ఆసక్తి రేకెత్తిస్తోంది. ఈ మూవీలో పుష్ప 2 విలన్ తారక్ పొన్నప్ప కీలక పాత్రలో నటిస్తుండగా.. కల్కి 2898 ఏడీ చిత్రానికి పనిచేసిన ఆండీ లాంగ్ గ్యుయెన్ స్టంట్ మాస్టర్‌గా పని చేస్తున్నాడని ఇన్‌సైడ్ టాక్. ఈ డెబ్యూ డైరెక్టర్ ఇటీవలే మైసా నుంచి రష్మిక మందన్నా అగ్రెసివ్ లుక్ లాంచ్ చేసి హైప్ క్రియేట్ చేస్తున్నాడు. కేరళలోని అథిరప్పిల్లీలో షూటింగ్ షురూ అయినట్టు ఇప్పటికే మేకర్స్ అప్‌డేట్ అందించారు.

# సమంతకూ తప్పని అభిమానుల తాకిడి

అభిమానుల అత్యుత్సాహం వల్ల 'ది రాజాసాబ్' ఈవెంట్‌లో నిధి అగర్వాల్ ఇబ్బంది పడిన సంఘటన మరువక ముందే సమంతకు కూడా అలాంటి చేదు అనుభవమే ఎదురైంది. తాజాగా హైదరాబాద్‌లో ఓ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి వచ్చిన ఆమె తిరిగి తన కారు వద్దకు వెళ్తుండగా అభిమానులు ఒక్కసారిగా సెల్ఫీల కోసం ఎగబడ్డారు. దీంతో సమంత ఇబ్బంది పడ్డారు. బాడీగార్డ్‌లు ఆమెను జాగ్రత్తగా కారు ఎక్కించడంతో ఊపిరిపీల్చుకున్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా నెటిజన్లు అభిమానుల తీరును తప్పుపడుతున్నారు.

# రజనీకాంత్ 50 ఏళ్ల సినీ ప్రస్థానం

## మరోమారు విడుదలైన పడియప్ప
## థియేటర్‌కు వెళ్లి చూసి థ్రిల్ అయిన రమ్యకృష్ణ



తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ కెరీర్‌లోనే ఎవర్ గ్రీన్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన చిత్రం 'పడయప్ప' తెలుగులో 'నరసింహ'మరోసారి ప్రేక్షకులను అలరిస్తోంది. రజనీకాంత్ 50 ఏళ్ల సినీ ప్రస్థానం పూర్తయిన సందర్భంగా ఈ చిత్రాన్ని ఈ నెల 12న థియేటర్లలో రీ రిలీజ్ చేశారు. 1999లో విడుదలైన ఈ సినిమా అప్పట్లో బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించింది.రజనీకాంత్ సరసన సౌందర్య, రమ్యకృష్ణ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రంలో ముఖ్యంగా నీలాంబరి పాత్ర సినీ చరిత్రలో నిలిచిపోయింది. ఆ పాత్రకు ప్రాణం పోసిన రమ్యకృష్ణ నటన ఇప్పటికీ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది. రీ రిలీజ్ సందర్భంగా తాజాగా రమ్యకృష్ణ స్వయంగా థియేటర్లో 'పడయప్ప'ను వీక్షించారు. దీనికి సంబంధించిన వీడియోను ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ 'ఫస్ట్ టైమ్ 'పడయప్ప' మూవీని థియేటర్లో చూశాను' అని పేర్కొన్నారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సినిమాలో రజనీకాంత్ ? రమ్యకృష్ణ మధ్య వచ్చే సీన్స్ ఇప్పటికీ అభిమానులకు ప్రత్యేకం. ముఖ్యంగా నీలాంబరి అజ్ఞాతవాసం ముగించుకుని, చాలా ఏళ్ల తర్వాత 'నరసింహ'ను ఎదుర్కొనే సీన్ సినీ చరిత్రలోనే ఐకానిక్‌గా నిలిచింది. డైలాగ్స్, బీజీఎం, ఇద్దరి నటన థియేటర్లో మరోసారి గూస్‌బంప్స్ తెప్పించాయి. ఆ సీన్ వచ్చిన సమయంలో థియేటర్లో ఫ్యాన్స్‌తో కలిసి రమ్యకృష్ణ కూడా ఆ క్షణాలను ఆస్వాదించారు. దీనికి సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అవుతూ, 'నీలాంబరి ఇస్ నాట్ జస్ట్ ఎ క్యారెక్టర్? ఇట్'స్ ఎ లెజెండ్' అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. రీ రిలీజ్ అయినప్పటికీ 'పడయప్ప'కు వస్తున్న రెస్పాన్స్ చూస్తే? ఈ సినిమా నిజంగా క్లాసిక్ అని మరోసారి నిరూపితమవుతోంది.



# అనీల్ రావిపూడి అదుర్స్

## ఏఐతో ప్రచార వీడియో వైరల్

సినిమా ప్రమోషన్ల విషయంలో దర్శకుడు అనిల్ రావిపూడి అనుసరిస్తున్న వైఖరి పూర్తిగా భిన్నంగా ఉంటుంది. తనదైన పంథాలో కొత్త ఐడియాలను అప్లై చేస్తూ, ప్రతి సినిమాను విడుదలకు ముందే ట్రెండింగ్‌లో ఉంచడంలో అనిల్ దిట్ట. ప్రస్తుతం ఆయన మెగాస్టార్ చిరంజీవితో తెరకెక్కిస్తున్న చిత్రం 'మన శంకరవరప్రసాద్‌గారు' విషయంలో కూడా ఇదే ఫార్ములాను ఫాలో అవుతున్నారు. ఈ సినిమా అనౌన్స్‌మెంట్ దగ్గర నుంచే వరుసగా క్రియేటివ్ ప్రమోషనల్ వీడియోలు రిలీజ్ చేస్తూ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నారు అనిల్. సినిమాతో సంబంధం ఉన్న ప్రతి అంశాన్ని ప్రమోషన్‌గా మార్చి వైరల్ చేయడంలో మరోసారి తన మార్క్ చూపిస్తున్నారు. లేటెస్ట్‌గా అనిల్ రావిపూడి ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టెక్నాలజీని కూడా తన సినిమా ప్రమోషన్స్ కోసం వినియోగించి అందరినీ ఆశ్చర్యపరిచారు. తాజాగా విడుదల చేసిన ఓ ప్రత్యేక వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. అలా నేను చూస్తూ పెరిగిన మెగాస్టార్ నుంచి? ఇలా నేను డైరెక్ట్ చేసే మెగాస్టార్ వరకు' అంటూ అనిల్ షేర్ చేసిన ఈ వీడియో అభిమానులను ఆకట్టుకుంటోంది. ఇందులో చిరంజీవి కెరీర్‌లోని క్లాసిక్ సినిమాలు.. ఖైదీ, గ్యాంగ్ లీడర్, ఘరానా మొగుడు, జగదేకవీరుడు అతిలోక సుందరి, ముఠామేస్త్రీ, అంజి, ఇంద్ర, శంకర్ దాదా ఎంబీబీఎస్, ఠాగూర్ వంటి చిత్రాల సెట్స్‌కు అనిల్ వెళ్లినట్టుగా ఏఐ వీడియోను రూపొందించారు. మెగాస్టార్‌తో కలిసి ఉన్నట్టుగా చూపిస్తూ తన అభిమానాన్ని వినూత్నంగా ఆవిష్కరించారు. వింటేజ్ చిరుని పరిచయం చేస్తూ రూపొందించిన ఈ వీడియో మెగా అభిమానులను సర్‌ప్రైజ్ చేస్తోంది. నెట్టింట ఈ వీడియోకు భారీ స్పందన వస్తుండగా, అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. అదే సమయంలో కొంత మంది నెటిజన్లు మాత్రం 'అనిల్ ప్రమోషన్ స్ట్రాటజీ మామూలుగా లేదు? సినిమా కోసం ఏదీ వదలడం లేదుగా' అంటూ కామెంట్లు చేస్తున్నారు.ఇదిలా ఉండగా, 2025 సంక్రాంతికి 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకుని బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్న అనిల్ రావిపూడి, 2026 సంక్రాంతికి కూడా అదే ఫీట్‌ను రిపీట్ చేయాలనే ఎ÷–లాన్‌లో ఉన్నారు. అందులో భాగంగానే మెగాస్టార్ చిరంజీవితో తెరకెక్కిస్తున్న 'మన శంకరవరప్రసాద్‌గారు' తో సంక్రాంతి బరిలోకి దిగుతున్నారు.నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం జనవరి 12న భారీ స్థాయిలో విడుదల కానుంది. అలాగే వెంకీ మామ (వెంకటేష్) ఈ మూవీలో తొలిసారి చిరంజీవితో కలిసి గెస్ట్ రోల్‌లో కనిపించనుండటం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది.

# విజయ్ దేవరకొండ 'రౌడీ జనార్ధన'

విజయ్ దేవరకొండ తన కెరీర్‌లో ఇప్పటి వరకూ పోషించని పాత్రలో 'రౌడీ జనార్ధన'లో కనిపిస్తారని ప్రముఖ నిర్మాత దిల్ రాజు తెలిపారు. ఇందులో పూర్తిస్థాయి మాస్ రోల్ ప్లే చేస్తున్నారంటూ అభిమానుల్లో ఆసక్తి రేకెత్తించారు. 80ల నాటి కథాంశంతో రూపొందుతున్న ఈ సినిమాలో విజయ్ గోదావరి యాస (తూర్పు గోదావరి) మాట్లాడతారని చెప్పారు. ఈ సినిమా టైటిల్ గింప్స్ లాంచ్ ఈవెంట్‌లో నిర్మాత మాట్లాడారు. ఈ మూవీ 2026లో విడుదలవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో దర్శకుడు రవికిరణ్ కోలా, నిర్మాత శిరీష్ తదితరులు పాల్గొన్నారు.



# నార్త్‌లో అఖండ-2 విడుదల

## హిందీ ఆడియన్స్ స్పందన అంతంత మాత్రమే



టాలీవుడ్ సీనియర్ హీరోలు మెగాస్టార్ చిరంజీవి, నటసింహం నందమూరి బాలకృష్ణలకు తెలుగులో ఉన్న స్టార్‌డమ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆరు పదుల వయసులోనూ తమదైన శైలితో ప్రేక్షకులను మెప్పిస్తూ, యంగ్ హీరోలకు గట్టి పోటీ ఇస్తూ వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు. తెలుగులో వీరిద్దరికీ అశేషమైన అభిమాన గణం ఉండటంతో పాటు భారీ మార్కెట్ కూడా ఉంది. అయితే నార్త్ మార్కెట్ విషయానికి వస్తే చిరంజీవి, బాలకృష్ణలకు ఆశించిన స్థాయిలో ఫలితాలు దక్కడం లేదనే అభిప్రాయం సినీ వర్గాల్లో వినిపిస్తోంది. మెగాస్టార్ చిరంజీవి స్వాతంత్ర్య పోరాట యోధుడి కథతో తెరకెక్కిన 'సైరా నరసింహ రెడ్డి' సినిమాతో నార్త్ ఆడియన్స్‌ను టార్గెట్ చేశారు. భారీ బ్జడెట్, పాన్ ఇండియా రిలీజ్, అమితాబ్ బచ్చన్ కీలక పాత్రలో నటించడం వంటి అంశాలు సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. కానీ హిందీలో పెద్ద ఎత్తున రిలీజ్ చేసినప్పటికీ, సినిమా ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. వసూళ్లు పరిమితంగానే నమోదయ్యాయి. ఆ తర్వాత మలయాళ సూపర్ హిట్ 'లూసిఫర్' రీమేక్‌గా తెరకెక్కిన 'గాడ్ ఫాదర్' తో మరోసారి చిరంజీవి నార్త్ మార్కెట్‌లో తన అదృష్టాన్ని పరీక్షించారు. రాజకీయ నేపథ్యం, పవర్‌ఫుల్ పాత్ర ఉన్నప్పటికీ ఈ సినిమా కూడా హిందీలో పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. ఇదే సమయంలో నటసింహం బాలకృష్ణ కెరీర్‌లో భారీ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'అఖండ' సినిమాతో నార్త్ ఆడియన్స్ దృష్టిని ఆకర్షించారు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం తెలుగులోనే కాదు, హిందీ డబ్బింగ్ వెర్షన్‌కి కూడా యూట్యూబ్, టీవీ ప్రసారాల ద్వారా మంచి ఆదరణ లభించింది.ఈ నేపథ్యంలో 'అఖండ 2: తాండవం' పై హిందీలో కూడా మంచి అంచనాలు ఏర్పడ్డాయి. సీక్వెల్ నార్త్ మార్కెట్‌లో క్లిక్ అవుతుందని ట్రేడ్ వర్గాలు భావించాయి. కానీ రిలీజ్ తర్వాత పరిస్థితి భిన్నంగా మారింది. హిందీ వెర్షన్‌కు థియేటర్లలో స్పందన నెమ్మదిగా ఉండటంతో వసూళ్లు నిరాశపరిచినట్లు సమాచారం. ఇప్పటివరకు కలెక్షన్లు కోటి రూపాయల మార్క్‌ను కూడా దాటలేదనే ప్రచారం జరుగుతోంది. దీంతో చిరంజీవి హిందీ సినిమాల కంటే బాలకృష్ణ సినిమా మరింత తక్కువ వసూళ్లు సాధించిందన్న చర్చ మొదలైంది. బాలీవుడ్ మార్కెట్‌లో 'అఖండ 2' విషయంలో అంచనాలు ఒకలా, ఫలితాలు మరోలా వచ్చాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రానున్న రోజులలో అయిన వీరు అనుకున్నది సాధిస్తారా అన్నది చూడాలి.

# దేశభక్తి ఒక్కటే కాదు.. కథాబలం కూడా ముఖ్యం

## ఛావా విజయంపై నటుడు విక్కీ కౌశల్

'ఛావా', 'ధురంధర్'.. ఈ రెండు సినిమాలు ఊహించని స్థాయిలో విజయాన్ని సొంతం చేసుకున్నాయి. ఈ సినిమాల విజయానికి ప్రధాన కారణం వీటి నేపథ్యం మాత్రమేనని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఈ రెండూ దేశభక్తి నేపథ్యంలో తెరకెక్కడం వల్లే విజయం సాధించాయంటూ వస్తోన్న కామెంట్స్‌పై విక్కీ కౌశల్ స్పందించారు. అలా అనడం సరికాదని.. నేపథ్యంతో పాటు వీటిలో ఎన్నో ఎమోషనల్ సన్నివేశాలు ఉన్నాయని అన్నారు. 'దేశభక్తి.. సినిమా విజయాలకు ఇది ఒక ఫార్ములా కాదు. అలా చెబితే అవమానించడమే అవుతుంది. దేశభక్తి నిర్వచించలేని ఓ అనుభూతి. దాన్ని మన సినిమాలు, సాహిత్యం, క్రీడలతో నిరంతరం చాటుకుంటూనే ఉండాలి. దేశంపై మనకున్న గౌరవం, ప్రేమకు నిదర్శనమే ఇలాంటి చిత్రాలు. మన దేశం గొప్పతనాన్ని ప్రపంచం ముందు చాటిచెప్పడానికి ఇదో మార్గం. 'ఛావా' లాంటి గొప్ప చిత్రంలో నటించినందుకు నాకెంతో గర్వంగా, ఆనందంగా ఉంది' అని విక్కీ కౌశల్ అన్నారు. శంభాజీ మహారాజ్ వీరగాథగా విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం 'ఛావా' లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించిన ఈ హిస్టారికల్ ఫిల్మ్ ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకువచ్చి భారీ విజయాన్ని అందుకుంది. ప్రపంచవ్యాప్తంగా రూ.807 కోట్లు వసూలు చేసింది. ఇక తాజాగా వచ్చిన 'ధురంధర్' శత్రుదేశమైన పాకిస్థాన్‌లోని ఉగ్రవాద సంస్థల్ని మూలాలతో సహా పెకిలించి.. అంతమొందించేందుకు భారత ఇంటెలిజెన్స్ బ్యూరో చేపట్టిన రహస్య ఆపరేషన్ నేపథ్యంలో రూపొందింది. దేశభక్తి అంశాలతో ముడిపడిన ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ 17 రోజుల్లో రూ.845 కోట్లు వసూలు చేసినట్లు చిత్రబృందం తెలిపింది.



# జనవరి 1 నుంచి ఏథర్ ఈవీ ధరలకు రెక్కలు



ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ తన స్కూటర్ల ధరలు పెంచుతున్నట్లు ప్రకటించింది. అన్ని మోడళ్లపై గరిష్ఠంగా రూ.3 వేల వరకు పెంపు ఉంటుందని తెలిపింది. జనవరి 1 నుంచి పెరిగిన ధరలు అమల్లోకి రానున్నాయి. ముడిసరకు ధరలు పెరగడం, అంతర్జాతీయంగా కీలక ఎలక్ట్రానిక్ ఉపకరణాల ధరలు పెరగడం, ఫారెక్స్ ప్రభావం కారణంగా ధరల పెంపు నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని కంపెనీ ఓ ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం ఏథర్ సంస్థ 450 సిరీస్‌లో పెర్ఫార్మెన్స్ స్కూటర్లను, రిజ్టా పేరిట ఫ్యామిలీ స్కూటర్లను విక్రయిస్తోంది. వీటి ధరలు రూ.1,14,546 నుంచి ప్రారంభమై రూ.1,82,946 వరకు ఉన్నాయి. ధరల పెంపు ఒక్కో మోడల్‌పై ఒక్కోలా ఉండనుంది. ప్రస్తుతం 'ఎలక్ట్రానిక్ డిసెంబర్' స్కీమ్ నిర్వహిస్తున్నామని ఏథర్ తెలిపింది. దీంతో ఎంపిక చేసిన నగరాల్లో ఏథర్ స్కూటర్ కొనుగోళ్లపై రూ.20వేల వరకు ప్రయోజనాలను అందిస్తున్నట్లు తెలిపింది. ఇప్పటికే కార్ల ధరలు పెంచుతున్నట్లు పలు కంపెనీలు ప్రకటించాయి. ఇతర ద్విచక్ర, విద్యుత్ వాహన తయారీ సంస్థలూ ధరల పెంపును ప్రకటించే అవకాశం ఉంది.




## భారీ లాభాల్లో సూచీలు..

### మళ్లీ 26వేల ఎగువకు నిఫ్టీ

**ముంబయి:** అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ బలపడడం, వచ్చే ఏడాది అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరోసారి వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న అంచనాలు దీనికి తోడయ్యాయి. దీంతో రెండు ప్రామాణిక సూచీలు వరుసగా రెండో రోజూ లాభపడ్డాయి. ముఖ్యంగా ఐటీ, మెటల్ స్టాక్స్ సూచీలకు దన్నుగా నిలిచాయి. భారత్-న్యూజిలాండ్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరడం కూడా పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. సెన్సెక్స్ ఉదయం 85,145.90 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,929.36) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 85,601.33 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 638.12 పాయింట్ల లాభంతో 85,567.48 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 206 పాయింట్ల లాభంతో 26,172.40 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 89.70గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్, టెక్ మహీంద్రా, టాటా మోటార్స్ పాసింజర్ వెహికల్స్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎల్అండ్‌టీ, బజాజ్ ఫైనాన్స్ మాత్రమే నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 61.20 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్స్ ధర 4, 411 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# అప్పుడు తీవ్రంగా కుంగిపోయా..
# క్రికెట్‌ను వదిలేద్దామనుకున్నా

## రోహిత్ శర్మ ఎమోషనల్

2023 వరల్డ్ కప్‌లో భారత్ అన్ని మ్యాచ్‌ల్లో గెలిచి ఆస్ట్రేలియాతో జరిగిన ఫైనల్‌లో ఓడిపోవడాన్ని క్రికెట్ అభిమానులు చాలా రోజుల వరకు జీర్ణించుకోలేకపోయారు. ముఖ్యంగా భారత ప్లేయర్లు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఆ ఫైనల్‌లో ఓటమితో తీవ్రంగా కుంగిపోయానని, క్రికెట్‌ను పూర్తిగా వదిలేద్దామనే ఆలోచన తన మనసులోకి వచ్చిందని అప్పటి కెప్టెన్ రోహిత్ శర్మ తాజాగా ఎమోషనల్ అయ్యాడు. గురుగ్రామ్‌లో జరిగిన మాస్టర్స్ యూనియన్ స్నాతకోత్సవానికి రోహిత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యాడు. ఈ సందర్భంగా 'హిట్‌మ్యాన్'ను సత్కరించారు. అనంతరం రోహిత్ 2023 వరల్డ్ కప్ గురించి మాట్లాడాడు. 'అందరూ తీవ్ర నిరాశకు గురయ్యారు. ఏం జరిగిందో నమ్మలేకపోయాం. ఇది వ్యక్తిగతంగా నాకు చాలా కఠినమైన సమయం. ఎందుకంటే నేను ఆ ప్రపంచకప్ కోసం కేవలం రెండు లేదా మూడు నెలల ముందు కాకుండా 2022లో కెప్టెన్సీని చేపట్టినప్పటి నుంచి ఎంతో కష్టపడ్డా. నా ఏకైక లక్ష్యం వరల్డ్ కప్ గెలవడం. అది టీ20 ప్రపంచకప్ అయినా, లేదా 2023 ప్రపంచకప్. అది సాధ్యం కాకపోవడంతో నేను పూర్తిగా కుంగిపోయాను. నా శరీరంలో ఎలాంటి శక్తి మిగలలేదు. కోలుకుని తిరిగి సాధారణ స్థితికి రావడానికి రెండు నెలల సమయం పట్టింది. ఎంతో కష్టపడి పని చేసినా ఫలితం రాకపోతే అలాంటి భావోద్వేగాలు రావడం సహజమే. ఒకానొక దశలో క్రికెట్‌ను పూర్తిగా వదిలేద్దామనే ఆలోచన వచ్చింది. ఆ ఆట నా నుంచి అన్నీ తీసుకుపోయిందని అనిపించింది. కానీ, జీవితం ఇక్కడితో మ-ఁగియదని నాకు తెలుసు. 2024 టీ20 ప్రపంచకప్ ముందుందని గుర్తు చేసుకున్నా. వరల్డ్ కప్ ఫైనల్ ఓటమి నుంచి బయటపడటానికి కొంత సమయం పట్టింది. ఆ తర్వాత మళ్లీ ఉత్సాహం వచ్చింది. క్రమంగా ఫోకస్ మొత్తం టీ20 ప్రపంచ కప్‌పై పెట్టాను' అని రోహిత్ శర్మ పేర్కొన్నాడు. రోహిత్ కెప్టెన్సీలో టీమ్ఇండియా 2024 టీ20 ప్రపంచ కప్ సాధించిన సంగతి తెలిసిందే. తర్వాత హిట్‌మ్యాన్ అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలికాడు.




## ఆస్ట్రేలియాలో అంత ఈజీ కాదు..

ప్రస్తుతం జరుగుతున్న యాషెస్ సిరీస్‌లో ఇంగ్లాండ్ పేలవ ప్రదర్శన చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటివరకు జరిగిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఇంగ్లాండ్ ఓటమిపాలై సిరీస్‌ను చేజార్చుకుంది. ఆస్ట్రేలియా గడ్డపై ఇంగ్లిష్ జట్టు వరుసగా నాలుగోసారి సిరీస్‌ను కోల్పోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఇంగ్లాండ్ టీమ్‌పై భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ వ్యంగ్యాస్త్రాలు సంధించాడు. గురుగ్రామ్‌లో జరిగిన మాస్టర్స్ యూనియన్ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన 'హిట్‌మ్యాన్' విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తన క్రికెట్ కెరీర్‌లో మరపురాని విజయాలను గుర్తుచేసుకున్నాడు. 2021లో గబ్బా టెస్టులో భారత్ చారిత్రాత్మక విజయాన్ని ప్రస్తావిస్తూ.. 'ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ గెలవడం అంత ఈజీ కాదు.. కావాలంటే ఇంగ్లాండ్ ఆటగాళ్లను అడగండి చెబుతారు' అంటూ రోహిత్ వ్యంగ్యాస్త్రాలు సంధించాడు. 'ఆస్ట్రేలియాలో 2021లో గబ్బాలో జరిగిన మ్యాచ్‌లో మేం (భారత్) గెలిచాం. రిషభ్ పంత్ అద్భుతంగా ఆడి జట్టుకు విజయాన్ని అందించాడు. మేం గెలుస్తామని ఎవరూ నమ్మలేదు. అలాంటి స్థితి నుంచి టీమ్ఇండియా పుంజుకుని గెలిచింది. ఆ మ్యాచ్‌లో మా ఫస్ట్ ఛాయిస్ ఆటగాళ్లందరూ గాయాలు, వివిధ కారణాల వల్ల అందుబాటులో లేరు. ఆ సమయంలో ఆస్ట్రేలియా కెప్టెన్ టిమ్ పైన్ కొన్ని కామెంట్స్ చేయడం నాకు ఇంకా గుర్తుంది. ఆ కామెంట్స్‌లో ఒకటి మమ్మల్ని ఆలోచనలో పడేసింది. మ్యాచ్ ప్రారంభమైనప్పుడు తుది జట్టులో ముగ్గురు అరంగేట్ర ఆటగాళ్లున్నారు. గబ్బా ఆస్ట్రేలియాకు కంచుకోట. అప్పటివరకు వారికి అక్కడ ఓటమి అనేదే తెలీదు. కానీ, గెలుపుపై ఆశలు లేని స్థితి నుంచి మేం గొప్పగా పుంజుకుని ఆ మ్యాచ్ గెలిపించాం. అయితే, టెస్ట్ క్రికెట్ ఎలా ఉంటుందో మీకు తెలుసు. ఇందులో ఆడటం అంత సులభం కాదు అని రోహిత్ పేర్కొన్నాడు.



## భగ్గుమన్న బంగారం, వెండి ధరలు

### అడ్డూ అదుపు లేకుండా పెరుగుదల

**న్యూఢిల్లీ, డిసెంబర్ 25 :** వెండి, బంగారం ధరలు మళ్లీ జోరందుకున్నాయి. వెండి ధరల గురించి చెప్పనక్కరలేదు.. తారాస్థాయిలో రేటు పలుకుతోంది. సోమవారం కిలో వెండి ధర ఏకంగా రూ.5 వేలకు పెరిగి ఆల్ టైమ్ రికార్డు రూ.2,31,000 కు చేరింది. వెండి దూకుడు చూస్తుంటే వచ్చే ఏడాది జనవరిలోనే రూ.2,50,000 వేలు పలికినా ఆశ్చర్యపడనక్కరలేదు అంటున్నారు నిపుణులు. సోమవారం దేశంలో బంగారం ధరలు భగ్గుమన్నాయి. యూఎస్ ఫెడ్ ప్రామాణిక వడ్డీ రేటులో కొత తప్పదన్న అంచనాలు బలపడటంతో పసిడి, వెండి ధరలు రికార్డు స్థాయిలో పెరిగాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు మధ్యాహ్నం 12 గంటల సమయంలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ. 1,35,280కు చేరుకుంది. కేవలం గంటల వ్యవధిలోనే రూ.1100 మేర పెరిగింది. ఇక 22 క్యారెట్ 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర కూడా రూ.1000 మేర పెరిగి రూ.1,24,000కు చేరుకుంది. కొన్ని రోజులుగా అడ్డూఅదుపు లేకుండా పెరుగుతున్న వెండి ధర నేడు కూడా అదే ట్రెండ్‌ను కొనసాగిస్తోంది. ఏకంగా రూ.5 వేల మేర పెరిగి రూ.2,19,000కు చేరుకుంది. అంతర్జాతీయంగా కూడా పసిడి, వెండి ధరలు చుక్కలను అంటాయి. 24 క్యారెట్‌ల ఔన్స్ స్పాట్ గోల్డ్ ధర 4,383 డాలర్లను తాకింది. అక్టోబర్‌లో నమోదైన జీవితకాల గరిష్ఠం కంటే 1.5 శాతం మేర పెరిగింది. ఔన్స్ వెండి ధర కూడా 3.4 శాతం మేర పెరిగి 70 డాలర్లకు చేరువైంది. వెనెజువెలా చమురుపై అమెరికా ఆంక్షలతో పాటు డాలర్ బలహీనపడటం, ఫెడ్ రేట్‌లో కోతపై పెరిగిన అంచనాలతో బంగారం, వెండి ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయని నిపుణులు చెబుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్ లో వెండిపై పెరిగిన పెట్టుబడులు, ఎలక్ట్రానిక్స్‌లో పెరిగిన వినియోగం, తరిగిన వెండి ఉత్పత్తుల నేపథ్యంలో వెండి ధరల రేటు వేగంగా పెరుగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇదే డిసెంబర్ 13వ తేదీన వెండి కిలో ధర రూ.2,10,000ఉండటం గమనార్హం. పసిడి కూడా ఏమాత్రం తగ్గకుండా పరుగు లంకించుకుంది. సోమవారం బంగారం ధరలు ఎలా ఉన్నాయంటే ? 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,100 పెరిగి రూ.1,35,280కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1000 పెరిగి రూ.1,24,000లకు చేరింది. పసిడి ధరలు కూడా మరింత పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు.




## విజయ్ హజారే ట్రోఫీలో ఆడనున్న గిల్, అభిషేక్, అర్ష్‌దీప్

విజయ్ హజారే ట్రోఫీ డిసెంబరు 24 నుంచి మొదలుకానుంది. ఈ టోర్నీ కోసం పంజాబ్ 18 మందితో జట్టును ప్రకటించింది. టీమ్ఇండియా ఆటగాళ్లు శుభ్‌మన్ గిల్, అర్ష్‌దీప్ సింగ్, అభిషేక్ శర్మలకు ఇందులో అవకాశం కల్పించారు. వికెట్ కీపర్, బ్యాటర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్‌తో పాటు ఆల్‌రౌండర్లు నమన్ ధీర్, అన్మోల్‌ప్రీత్ సింగ్, రమణ్‌దీప్ సింగ్, సన్వీర్ సింగ్‌ను ఎంపిక చేశారు. అయితే, కెప్టెన్ ఎవరనేది మాత్రం వెల్లడించలేదు. పంజాబ్ తమ ఏడు లీగ్ దశ మ్యాచ్‌లను జైపూర్‌లో ఆడనుంది. ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, సిక్కిం, గోవా, ముంబయితో తలపడనుంది. ఈ మ్యాచ్‌లు జనవరి 8న ముగుస్తాయి. జనవరి 11 నుంచి భారత్, న్యూజిలాండ్ మధ్య మూడు వన్డేల సిరీస్ ప్రారంభంకానుంది. ఈ సిరీస్‌లో గిల్, అభిషేక్, అర్ష్‌దీప్ ఎంపికైతే.. విజయ్ హజారే ట్రోఫీకి వారు ఎన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటారో చూడాలి.

**విజయ్ హజారే ట్రోఫీకి పంజాబ్ జట్టు:** శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (వికెట్‌కీపర్), హర్నూర్ పన్ను, అన్మోల్‌ప్రీత్ సింగ్, ఉదయ్ సహారాన్, నమన్ ధీర్, సలీల్ అరోరా, సన్వీర్ సింగ్, రమ-ణ్‌దీప్ సింగ్, జషన్‌ప్రీత్ సింగ్, గుర్నూర్ బ్రార్, హర్‌ప్రీత్ బ్రార్, రఘు శర్మ, క్రిష్ భగత్, గౌరవ్ చౌదరి, సుఖదీప్ బజ్వా.

## గిల్‌ను తొలగిస్తారని ఊహించలేదు : శ్రీకాంత్

మొన్నటివరకు పొట్టి ఫార్మాట్‌లో టీమ్ఇండియాకు వైస్ కెప్టెన్‌గా ఉన్న శుభ్‌మన్ గిల్‌ను 2026 టీ20 ప్రపంచకప్‌నకు పక్కన పెట్టడంతో షాక్ అయ్యానని భారత మాజీ కెప్టెన్, చీఫ్ సెలక్టర్ క్రిస్ శ్రీకాంత్ పేర్కొన్నాడు. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని ప్రస్తుత సెలక్షన్ కమిటీ ఇంతటి కఠిన నిర్ణయం తీసుకుంటుందని తాను ఊహించలేదన్నాడు. అదే సమయంలో ప్రపంచ కప్‌నకు ఎంపిక చేసిన జట్టు అద్భుతంగా ఉందని కితాబిచ్చాడు. 'నేను ఆశ్చర్యపోయా. ఇది అద్భుతమైన సెలక్షన్. శుభ్‌మన్ గిల్‌ను తొలగిస్తారని నేను ఊహించలేదు. తొలుత అతనిని వైస్ కెప్టెన్‌గా నియమించారు. ఆస్ట్రేలియా పర్యటనలో కూడా గిల్ వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. వన్డేల్లో శుభ్‌మన్ గిల్ గొప్ప ఆటగాడు. టెస్టుల విషయానికొస్తే.. ఇంగ్లాండ్‌లో భారీగా పరుగులు చేశాడు. కానీ, టీ20ల్లో ఇబ్బందిపడుతున్నాడు. ఇషాన్ కిషన్ లేదా మరెవరితోనైనా పోలిస్తే గిల్ స్ట్రైక్‌రేట్ చాలా తక్కువ. దేశవాళీలో అదరగొట్టిన ఇషాన్‌ను ఎంపిక చేయడం మంచి విషయం. రింకు సింగ్‌ను జట్టులోకి తీసుకున్నారు. మొత్తంమీద సెలక్షన్ కమిటీ అద్భుతమైన టీమ్‌ను ఎంపిక చేసింది. అభిషేక్ శర్మ, సంజుశాంసన్ ఓపెనింగ్ చేస్తారు. అభిషేక్ ప్రస్తుతం ప్రపంచంలోనే నంబర్ వన్ బ్యాటర్' అని క్రిస్ శ్రీకాంత్ అన్నాడు. ఈ ఏడాది టెస్టు, వన్డే కెప్టెన్‌గా పగ్గాలు చేపట్టిన గిల్.. ఆసియా కప్‌తో తిరిగి టీ20ల్లోకి పునరాగమనం చేశాడు. అంతేకాకుండా పొట్టి ఫార్మాట్‌లో అతడికి వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించడంతో భవిష్యత్ సారథి అతడేనని అంతా ఫిక్సయ్యారు. కానీ, అంచనాలకు తగ్గట్లు రాణించలేదు. 15 మ్యాచ్‌ల్లో 291 పరుగులే చేశాడు. అందువల్లే గిల్‌ను టీ20 ప్రపంచకప్‌నకు ఎంపిక చేయలేదని క్రికెట్ పండితుల అభిప్రాయం. ఫిబ్రవరి 27 నుంచి పొట్టి ప్రపంచకప్ ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఈ మెగా టోర్నీకి భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి.



## ఫిబ్రవరి 13 నుంచి టాలీవుడ్ ప్రొ లీగ్

### ట్రోఫీ, జెర్సీ ఆవిష్కరణలో కపిల్, సెహ్వాగ్, రైనా

**మాదాపూర్ :** సినీ ప్రముఖులు పాల్గొనే టాలీవుడ్ ప్రొ లీగ్ (టీపీఎల్) క్రికెట్ టోర్నీ ఫిబ్రవరి 13 నుంచి హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో జరగనుంది. మాదాపూర్ హెచ్ఐసీసీలో ఆదివారం ఈ లీగ్ ట్రోఫీని, జెర్సీని సినీ, క్రికెట్ ప్రముఖులు ఆవిష్కరించారు. దిగ్గజ క్రికెటర్ కపిల్‌దేవ్, మాజీ స్టార్ ఆటగాళ్లు వీరేంద్ర సెహ్వాగ్, సురేశ్ రైనాలతో పాటు సినీ నిర్మాత దిల్ రాజు, నటుడు సోనూ సూద్, సంగీత దర్శకుడు తమన్, నటి రాశీ ఖన్నా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కపిల్, సెహ్వాగ్, దిల్ రాజు, సోనూ సూద్ కలిసి స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్ ఆడారు. ఈ సందర్భంగా కపిల్ దేవ్ మాట్లాడుతూ.. సినీ పరిశ్రమ క్రికెట్ పట్ల ఆసక్తి చూపడం అభినందనీయమన్నారు. హైదరాబాద్ అందమైన నగరమే కాదు, రుచికరమైన వంటకాలకు కేంద్రమని కొనియాడారు. వీరేంద్ర సెహ్వాగ్ మాట్లాడుతూ.. సినిమా రంగానికి చెందిన నటులు, టెక్నీషియన్లు కలిసి క్రికెట్ లీగ్ ఆడటం మంచి పరిణామమన్నారు.

దిల్ రాజు మాట్లాడుతూ.. తెర మీద కనిపించే నటులతో పాటు తెర వెనుక ఉండి పని చేసేవారితో కలిసి టీపీఎల్ టోర్నీ జరుగుతుందన్నారు. ఆరు జట్లతో కూడిన ఈ ఫ్రాంచైజీ ఆధారిత లీగ్‌లో ప్రముఖ నిర్మాతలు జట్లకు యజమానులుగా వ్యవహరిస్తారని రాజు తెలిపారు. సినీనటుడు ఆశిష్ విద్యార్థి, దర్శకుడు అనిల్ రావిపూడి, ఈబీజీ గ్రూప్ అధ్యక్షుడు ఇర్ఫాన్ ఖాన్, టీపీఎల్ వ్యవస్థాపకుడు వంశీ కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.




## ఐఫోన్ల తయారీ కోసం 30వేల మందికి ఉద్యోగాలు

### 80% మహిళలే

చైనా నుంచి పంపిణీ వ్యవస్థలను మళ్లించే కార్యక్రమాన్ని దిగ్గజ సంస్థ యాపిల్ వేగవంతం చేసింది. ఇందులోభాగంగానే కర్ణాటకలో ఏర్పాటుచేసిన ఫాక్స్‌కాన్ యూనిట్‌లో భారీగా నియామకాలు చేపట్టింది. కేవలం 8-9 నెలల్లోనే దాదాపు 30వేల మందికి ఉద్యోగాలు ఇచ్చినట్లు 'ఎకనామిక్ టైమ్స్' కథనం వెల్లడించింది. వీరిలో అత్యధికంగా మహిళలే ఉండటం విశేషం. బెంగళూరు సమీపంలోని దేవనహళ్లిలో ఫాక్స్‌కాన్ దేశంలోనే రెండో అతిపెద్ద ఐఫోన్ తయారీ యూనిట్ ను ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే. 300 ఎకరాల విస్తీర్ణంలో ఉండే ఈ ఫ్యాక్టరీలో ఇటీవల నియామకాలను భారీగా పెంచింది. ప్రస్తుతం ఈ యూనిట్‌లోని మొత్తం సిబ్బందిలో దాదాపు 80శాతం మంది మహిళలే. వీరిలో చాలామంది ఫ్రెషర్లేనని సదరు కథనం పేర్కొంది. ఇక్కడ తొలుత ఐఫోన్ 16 మోడల్‌ను ఉత్పత్తి చేయగా.. ఇటీవల ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ మోడల్స్ తయారీని కూడా ప్రారంభించారని సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ ఎకనామిక్ టైమ్స్ కథనం వెల్లడించింది. ఇక్కడ ఉత్పత్తి చేస్తోన్న ఐఫోన్లలో 80శాతం విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. వచ్చే ఏడాది నాటికి ఈ యూనిట్‌లో మొత్తం సిబ్బందిని 50 వేలకు పెంచాలని ఫాక్స్‌కాన్ భావిస్తున్నట్లు సమాచారం. ఇక, ఉద్యోగుల కోసం ప్లాంట్ ప్రాంగణంలోనే అనేక సౌకర్యాలు కల్పిస్తున్నారు. సిబ్బంది కోసం ఇళ్లు, వైద్య, విద్య సదు-పాయాలు అందిస్తుండటంతో ఈ యూనిట్ మినీ టౌన్‌షిప్‌గా కన్పిస్తోంది. ఫాక్స్‌కాన్ తొలి ఐఫోన్ తయారీ ప్లాంట్‌ను తమిళనాడులో ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఇక్కడ 41వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరిలోనూ అత్యధికంగా మహిళలే ఉన్నారు. డిజైన్, టెక్ సంబంధిత విభాగాల్లో మహిళలను అగ్రగాములుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా తాము నియామకాలు చేపడుతున్నట్లు ఫాక్స్‌కాన్ గతంలో తెలిపింది.

Printed, published and owned by **VELLENKI JAYAPAL REDDY**, printed at **M/s KAKATIYA PRINTERS**, H-No: 24-91/72/1, Block No. 29, Plot Nos 72, 73 and 74, Lakshminarayana Nagar IDA Uppal, Uppal Mandal, Medchal-Malkajgiri Dist, Telangana-39, Published at H-No: 3-125/92/86, Anaghapuri Colony, Boduppal, Medipally Mandal, Medchal-Malkajgiri Dist, Telangana- 92, Editor: **VELLENKI JAYAPAL REDDY**, Cell No: **9346984911, 9133445456**, RNI NO: TELTEL/2023/84471, website: www.nedudailynews.com, e-mail: vellenkijayapalreddy@gmail.com